నేటినిజం సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 26-6-2025

### గువ్వలు

'ఫీజు' గుంజడమే
కాన్సెప్ట్..
టెక్నో.. స్కూల్ ది.. అంతా టెక్కే

వత్తి తాగుతుంది
నూనెను 'గమ్మత్తు'గా
చీకటిని చెక్కుతూ 'దీపఖడ్గం'

ఆ గాడిదకు
వరకట్నం ఎక్కువ
పెద్ద చదువు.. ఉద్యోగం పెద్దది.

నాయకుడు సమస్యపై
అధికారి గట్టున మేస్తున్నారు
అవినీతి
'మూడు పువ్వులు ఆరుకాయలు'



-జిందం అశోక్
సెల్:8978532225

### ఘంటారావం

పల్లెల్లో పశువుల
కనుమరుగు
గోధూళి వేళ ఘనత
ఎవరెరుగు?.

వాదనలో ఓడించడమే
విధానమనుకోకు
హృదయాలను గెలవడం
ప్రధానమని మరువకు

మూర్ఖులు
వాదిస్తారు
మేధావులు
బోధిస్తారు

పొద్దున్నే
పెళ్లి
మధ్యాహ్నం
లొల్లి.

మొదట
ఆచరించు
పిదప
ప్రచురించు.



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

# అందరి అభినందనలు అందుకున్న "చలన కాంక్ష"



పుస్తకావిష్కరణలో బైస దేవదాసు, దేవానంద్ నాగేళ్ళ, రచయిత మౌనశ్రీ మల్లిక్, శ్రీమతి స్వప్న, అందెశ్రీ, సుద్దాల అశోక్ తేజ, దాస్యం సేనాధిపతి, ఎస్.రఘు, తులసి వెంకట రమణాచార్యులు, మూర్తి శ్రీదేవి, శ్రీమతి పద్మకళ తదితరులు.

మనసు గాయపడ్డ మనిషి తన మనుగడను పటిష్టవంతంగా మలుచుకుంటాడని సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. కవి మౌనశ్రీ మల్లిక్ రచించిన "చలన కాంక్ష" కవితా సంపుటిగా ఆవిష్కరణ, అంకితోత్సవ సభ ఈ నెల 22 ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, ఉదయ సాహితీ-తెలంగాణ సంయుక్తాధ్వర్యంలో జరిగింది. సభకు అధ్యక్షత వహించిన సుద్దాల అశోక్ తేజ మట్లాడుతూ నిజ జీవితంలో ఎదురయ్యే ఎన్నో అవమానాలతో మనిషి సతమతమవుతాడని వాటిని ఎదిరించి నిలదొక్కుకోవడం ఎంతో కష్టమని అన్నారు. ఆ కష్టాల్లోంచే చిక్కని కవిత్వం పుట్టుకొస్తుందని అన్నారు. నాలానే మౌనశ్రీ మల్లిక్ జీవితంలో ఎన్నో ఆటు పోట్లు ఎదుర్కొన్నారని మంచి కవిత్వం రాస్తున్నారని మల్లిక్‌ను అభినందించారు. తక్కువ కాలంలో సినీ గేయ కవిగా ప్రాచుర్యం పొందారని వెయ్యికి పైగా సినీ గీతాలు రాశారని కొనియాడారు.

'చలన కాంక్ష' కవితా సంపుటిని ఆవిష్కరించిన లోక కవి అందెశ్రీ మాట్లాడుతూ.. పల్లె నుండి నగరానాకి వలస వచ్చిన ప్రతి వ్యక్తికి ఈ నగరం పెద్దమ్మ లాంటిదని నగరాన్ని అమ్మతో పోల్చారు. నాలాంటి వాళ్ళ నెందరినో అక్కున చేర్చుకుందని గొప్ప జీవితాన్ని ప్రసాదించిందని అన్నారు. మౌనశ్రీ మల్లిక్ ఎదగడానికి ఈ నగరం ఎంతో దోహద పడిందని మౌనశ్రీని అందెశ్రీ అభినందించారు.

తెలంగాణా భాషా సాంస్కృతిక శాఖ, సంచాలకులు డా॥ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ ప్రపంచంలోని నదులను దర్శనం చేసుకుని నదుల గొప్పదనాన్ని లోకానికి పరిచయం చేసి లోక కవి అందెశ్రీ అందరి మనన్నలు పొందారని అన్నారు.

మౌనంగా ఎదుగుతున్న మౌనశ్రీ కవిత్వం ఎంతో గాఢంగా వుంటుందని వెలుగులు చిమ్ముతుందని అన్నారు. వెయ్యి సినీ గేయాలు రాసిన మౌనశ్రీని అభినందిస్తు ఓ నలభై గేయాలను ఎంపిక చేసి సంగీత విభావరిని రవీంద్రభారతిలో ఏర్పాటు చేస్తే బావుంటుందని తన సహకారం వుంటుందని తెలిపారు.

ప్రముఖ విమర్శకులు, ఉస్మానియా విద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా॥ఎస్. రఘు మాట్లాడుతూ.. ఈ పుస్తకంలోని ప్రతి కవితలో చలనం వుందని చైతన్యవంతమైన కవిత్వంతో పాటు సినీగేయ కవిగా ఎదుగుతున్న మౌనశ్రీకి అభినందనలు తెలిపారు.

మౌనశ్రీ మల్లిక్ సాహిత్యంలో మంచి పట్టు సాధించారని ఎంత ఎదిగినా ఒదిగి వుండే మనస్తత్వం కలిగినవాడని ఆయన రాసిన 'చలన కాంక్ష' మా ఉదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో వెలువడడం మాకు ఎంతో ఆనందంగా వుందని ప్రముఖ సాహితీవేత్త ఉదయ సాహితి తెలంగాణ రాష్ట్ర గౌరవాధ్యక్షులు దాస్యం సేనాధిపతి అన్నారు.



దేవానంద్ నాగేళ్ళకు 'చలన కాంక్ష' కవితా సంపుటిని అంకితం ఇస్తున్న మౌనశ్రీ మల్లిక్.



మౌనశ్రీ మల్లిక్-స్వప్న దంపతులను సత్కరిస్తున్న అతిథులు.

ఈ రోజు ధరించిన ఎరుపురంగు వస్త్రాలతో మౌనశ్రీ మల్లిక్ ఓ మెరుపులా కన్పిస్తున్నారని ఆయన కవిత్వం కూడా ఆ స్థాయిలో రాస్తున్నారని నేటినిజం సంపాదకులు బైస దేవదాసు మౌనశ్రీని ప్రశంసించారు.

ప్రతి పురుషుడి ఎదుగుదలకు జీవిత సహచరి సహకారం వున్నట్టే మౌనశ్రీ అనతికాలంలో కవిగా సినీ గేయ కవిగా దూసుకుపోతు గొప్ప గుర్తింపు వెనుకాల మౌనశ్రీ జీవిత సహచరి శ్రీమతి స్వప్న పూర్తి సహకారం వుందని మౌనశ్రీ దంపతులను అభినందించారు.

ఈ చలనకాంక్ష వెలువడడానికి ముంబాయి కవి , ఎంతో మందికి ఆర్థిక సహకారం అందిస్తు సాహిత్య సేవ చేస్తున్న దేవానంద్ నాగెళ్ళ కాంక్ష వుందని ఇది "దేవానంద్ కాంక్ష" అని దేవానంద్ నాగెళ్ళను కొనియాడారు.

కృతి స్వీకర్త దేవానంద్ నాగెళ్ళ మాట్లాడుతూ.. అంచెలంచెలుగా ఎదుగుతున్న మౌనశ్రీ మల్లిక్ మరింత ఎత్తుకు ఎదగాలని మరికొంత కాలం తర్వాత మౌనశ్రీ మల్లిక్ మనకు అందనంత ఎత్తులో వుంటారని అన్నారు. వ్యాపారంలో కోట్లాది రూపాయలు నష్టపోయాయని, నాకు ధైర్యాన్ని ఇచ్చి నిలబెట్టింది కవిత్వమేనని చెప్పారు. గొప్పవాళ్ళ కవిత్వం చదివిన తర్వాత నాలో ధైర్యం సహనం ఆలోచన శక్తి పెరిగిందని చెబుతూ కవిత్వం రాస్తున్న వారికి చేదోడు వాదోడుగా తన సహకారం అందిస్తుంటానని వివరించారు. తాను కూడా కవిత్వం రాస్తున్నానని సాహిత్యమంటే తనకెంతో ఇష్టమని, నాకు "చలన కాంక్ష" స్వీకరించినందుకు ఆనందంగా వుందని అంకితం ఇచ్చిన మౌనశ్రీకి ధన్యవాదాలు తెలిపారు.

నా గురించి, నా కవిత్వం గురించి మాట్లాడిన మీ అందరి ముందు నేను మౌనంగా వుండడమే సముచితమని, సభకు వచ్చి మీరంతా అభినందించడం, ఆశీర్వదించడం ఆనందంగా వుందని అందరికీ ధన్యవాదాలు తెలిపారు మౌనశ్రీ మల్లిక్.

సభలో జబర్దస్ట్ ఫేం నటుడు రచ్చరవి, కందుకూరి శ్రీరాములు, డా॥ నాళేశ్వరం శంకరం, బడేసాబ్, కృష్ణవేణి, సినీ ప్రముఖులు పలువురు పాల్గొన్నారు.

కవయిత్రి శ్రీమతి పద్మకళ స్వాగత వచనాలు పలుకగా, ఉదయ సాహితి రాష్ట్ర మహిళా కార్యదర్శి మూర్తి శ్రీదేవి, వందన సమర్పణ చేశారు.

పుస్తక సమీక్షలు

# సామాజిక రుగ్మతల పట్ల నిరసన

అన్ని వృత్తులకన్నా ఉపాధ్యాయ వృత్తి ఎంతో మానవీయమైనది. తల్లిదండ్రులు జన్మనిస్తారు. కాని పిల్లవాడికి సక్రమమైన మార్గ నిర్దేశనము చేసి భవితకు చక్కని బాటలు వేసేది ఉపాధ్యాయుడే! డా॥ (శ్రీమతి) బండారి సుజాతగారు బోధన మరియు సాహిత్య రంగాల్లో అభిరుచి అలవర్చుకున్నారు. ప్రవృత్తి గా కవితలు, కథలు అల్లుతున్నారు. తన చుట్టూ చోటు చేసుకుంటున్న సంఘటనల్ని తన కథా వస్తువుగా మలుచుకుంటూ, సమాజంలోని మంచి చెడ్డలను బేరీజు వేస్తున్నారు. తన వంతు ప్రయత్నంగా నీతి సందేశాలను అందిస్తున్నారు.

ప్రస్తుత కథా సంపుటి **"వెలుతురు చూడని ఎన్నియలు"**లో 30 కథలున్నాయి. తన వృత్తిలో గమనించిన బాగోగులు సమాజ రుగ్మతలు కథలుగా మలిచి మనకందిస్తున్నారు.

తల్లి పాలు బిడ్డ ఎదుగుదలకు, మానసికాభివృద్ధికి ప్రథమ సోపానమని డాక్టర్లే అంగీకరించిన సత్యం. అందం పోతుందనో! మరేదో కారణాల వల్లో కొందరు తమ బిడ్డలకు పోత పాలు అలవాటు చేస్తారు అందువల్ల కలిగే నష్టాలను **'జగతికి వెలుగు అమ్మ"** కథ వివరిస్తుంది. బిడ్డకు తల్లిపాలు పట్టకపోతే అటు తల్లి బరువు పెరుగుతుంది. గర్భసంచి సకాలంలో యదాస్థితికి రాదు. తల్లికి గుండెలు బరువెక్కుతాయి. ఇటు పాప 'మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యవంతులు కావటమే కాకుండా, మాతృశిశువుల మధ్య అనుబంధం గాఢతరమౌతుంది. పశు పక్ష్యాదులు కూడా మాతృత్వాన్ని ఓ వరంగా భావిస్తాయి. లాంటి విజ్ఞాన కరమైన విషయాలు తెలుసుకుంటాము.

' ఏ స్థాయికి ఎదిగినా వ్యవసాయాన్ని మర్చిపోకూడదు. చదువుకున్నోళ్ళు అందరూ పట్టణాలకు విదేశాలకు పోయి నేల తల్లిని మరుస్తున్నారు. నాకు (అది) ఇష్టం లేదు. చేసేది పెద్ద ఉద్యోగం మంచి జీతం. ఈ మట్టి వాసన ఇష్టం.




**ప్రతులకు:**
డా॥ బండారి సుజాత
ఇ.నెం. 2-9-150/3
వికాస్‌నగర్, రోడ్ నెం. 28
హనుమకొండ-506 001.
సెల్: 99597 71228

కనుక నెలకు ఓ రోజు పొలం పనులు చేసి, సంపాదించిన కూలి డబ్బులు పేదవాళ్ళకు ఇస్తాను. పొలం పనులు చేస్తున్న మీ అందరితో మాట్లాడటం ఇష్టం' అంటుంది లాస్య అనే పెద్ద చదువులు చదివిన ఓ ఉన్నతోద్యోగి. ఎంత గొప్ప భావన! జన్మనిచ్చిన మట్టికి, అన్నం పెట్టే రైతుకు గౌరవం ఇవ్వాలని **'మట్టి మనిషి'** కథలోని లాస్య పాత్ర ద్వారా చెప్పించారు రచయిత్రి.

భార్య 'బేనామి', గెలుపు లలితదే అయినా చక్రం త్రిప్పటం భర్త రాజారాం చూసుకుంటాడు. పంచాయితీ ఎన్నికల్లో రిజర్వేషన్ సీట్లలో చాలా వరకు జరుగుతున్నది ఇదే. భార్య లలిత లలితంగా ఉన్న ఏదైనా చేయగల సత్తా కల యువతి. తల్లి సావిత్రమ్మ సద్బోధతో లలితతో- ముందు నడవకుండా, ఆమెతోపాటు నడుద్దామని నిర్ణయించుకుంటాడు రాజారాం. పల్లెటూళ్ళలో, పంచాయితీ ఎలక్షన్లలో నేడు జరుగుతోన్న ఉదంతానికి మంచి 'టర్న్' ఇచ్చారు రచయిత్రి' ఆమెను **"గౌరవిద్దాం"** అన్న కథలో.

కొడుకు మరణిస్తాడు. కోడలు పరిచయమున్న 'రామం'తో వెళ్ళిపోతుంది. అత్తా మామల కుటుంబం నానా రభస చేయలేదు. యాగీపెట్టలేదు. 'రామమే రెండవ కొడుకని ఆశీర్వదిస్తే పోలా!' అనుకున్నారు అత్తామామలు. **''ఊహించని మలుపు"** కథలో పాఠకులు కూడా ఊహించని మలుపు ఇది. రచయిత్రి Off-beat ఆలోచనలకు మంచి సందేశానికి ఈ కథ ఓ ఉదాహరణ.

దేశానికి వెన్నెముక అయిన రైతు ఎప్పుడూ నష్టజాతకుడే. పత్తి అంటే అందరు పత్తివేసి పీకల లోతు అప్పుల్లో మునుగుతారు. వడ్లు మిల్లు కాడ పోస్తే వానకు తడిసి మొలకలొచ్చి మిల్లర్లు కొనకపోతే రైతులందరు ధర్నా చేస్తే కంటితుడుపు చర్యగా మిల్లర్లు కొంటారు. ప్రభుత్వం సన్నవడ్లు వేయమంటే, అందరు వేసే వరకు వడ్ల ధర తగ్గి రైతులు నష్టపోతారు. రైతులందరు అందరి కష్టాలు మనవ టినుకుని సమిష్టగా సాగితే ఫలితం ఉంటుందన్న రచయిత్రి సూచన (కర్షకుని వెతలు- కథ) బాగుంది.

ఆడది అరిటాకు. అందునా ఈ మధ్య **'లవ్ జిహాద్'** నేపథ్యంలో నేటి కాలపు యువతులు సానుభూతికి కూడా నోచుకోవటం లేదు. తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించే కథ **'అరిటాకు'**.

తెలుగును వెలిగిద్దాం' అన్న కథలో రచయిత్రి హాస్యం కూడా పండించగలరని నిరూపించుకుంటూ అమ్మలా ప్రేమను పంచే అమృత భాష తెలుగును మరిచిపోవద్దంటారు.

గురుభ్యోన్నమః చేయూత, తప్పటడుగులు, సహనం లాంటి కథల్లో స్కూలు వాతావరణం పాత్రలు ఆలోచనలు ఔచిత్యాలు బహుశా రచయిత్రి తన బోధనానుభవంలోంచి గ్రహించినవి కనుక సహజంగా స్ఫూర్తి దాయకంగా ఉండటమే కాదు, పాఠకుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతాయి.

రచయిత్రికి అభినందనలు.



- కూర చిదంబరం
సెల్: 8639338675

# డాక్టర్ ముదావత్ కిషన్‌కు ఏకా పద్మస్మారక పురస్కారం



డా॥ ముదావత్ కిషన్‌కు ఏకా పద్మ స్మారక పురస్కారం ప్రదానం చేస్తున్న బైస దేవదాసు, ఏకా వెంకట ధర్మ సంవర్ధిని, ఏకా నాగరాజు రామమోహనరావు, డా॥ దంతుర్తి వెంకటరావు, పొత్తూరి జయలక్ష్మి, వి. రుద్రవీణ బాల సుబ్రహ్మణ్యం, లంకా వెంకట సుబ్రహ్మణ్యం.

అనుబంధాలు, ఆప్యాయతలు, ప్రేమానురాగాలు, మానవత్వపు విలువలు నేటికీ భారతీయ కుటుంబ వ్యవస్థలో మిగిలేవున్నాయని నేటినిజం సంపాదకులు బైస దేవదాసు అన్నారు. శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య, శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో కళా సుబ్బారావు కళా వేదికలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, సంఘ సేవకురాలు ఏకా పద్మ స్మారక పురస్కార ప్రదానోత్సవ సభను నిర్వహించారు. ఈ సభకు గౌరవ అతిథిగా విచ్చేసిన బైస దేవదాసు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా మానవతావాది ఏకా నాగరాజ రామమోహన రావు ఆయన భార్య ఏకా పద్మ పేరు మీదుగా పేరు పొందిన వైద్యులకు స్మారక పురస్కారాలు ఇవ్వడం చాలా సముచితంగా ఉందని అన్నారు. అవంతి డిగ్రీ అండ్ పి.జీ. కళాశాల డైరెక్టర్ డాక్టర్ దంతుర్తి వెంకటరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సాహితీవేత్త పొత్తూరి జయలక్ష్మి, ఆచార్య చాణక్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వి.రుద్రవీణ బాల సుబ్రహ్మణ్యం, పురస్కార ప్రదాత పద్మ ఆప్టికల్స్ అధినేత ఏకా నాగరాజు రామమోహన్‌రావు, ఏకా వెంకట ధర్మ సంవర్ధిని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ముదావత్ కిషన్‌ను నిర్వాహక సంస్థ పక్షాన సభలో పాల్గొన్న అతిథులు ఘనంగా సత్కరించి, ఏకా పద్మ స్మారక పురస్కారం ప్రదానం చేశారు. పురస్కార స్వీకర్త డాక్టర్ ముదావత్ కిషన్ సభా ముఖంగా కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ అధ్యక్షులు, ప్రముఖ కవి వెంకట సుబ్రహ్మణ్యం సభకు స్వాగతం పలికారు.

# బాల రచయిత్రి 'వైష్ణవి' శతక పద్యాలు-కథలు

'అమ్మ' అనే సరళ వచన శతకాన్ని రాసి తెలంగాణ సీమలోని చదువరులను కదిలించిన నిజామాబాద్ జిల్లా, ఏర్గట్ల మండలం తడపాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని దేగల వైష్ణవి, తెలంగాణ గ్రామీణ ప్రాంతాల పాఠశాలలో తల్లి పలుకు ఎంత ప్రేమానురాగాలతో జీవం పోసుకుంటున్నదీ తెలియచేస్తోంది. తెలంగాణ పల్లెలలో, బడుల చదువులో తెలుగు పండితులు బాల బాలికలలో పఠన, రచనా శక్తిని వెలిగించి, తల్లి భాషకు ప్రాణం అందిస్తుండటం పరిశీలిస్తే, తెలుగుకు రోజులు చెల్లిపోయాయనే అభిప్రాయం అవాస్తవం అనిపిస్తోంది. తెలుగు ఉపాధ్యాయులు, బాల బాలికలలో చివురింప చేస్తున్న విత్తుల పంట బాల సాహితీ క్షేత్రంలో పొత్తాలుగా ఫలించటం అబ్బురమని పిస్తుంది. తడపాకల్ పాఠశాల తెలుగు ఉపాధ్యాయునిగా ప్రవీణ్‌కుమార్ శర్మ, ప్రోత్సాహంతో బాల రచయిత్రి దేగల వైష్ణవి, చదువు (సరళ వచన శతకం), చిన్నారి కథలు వెలువరింప చేయటం అభినందనీయం. బాలరత్న అవార్డు గ్రహీతగా ప్రశంసలందుకున్న వైష్ణవి, 'చదువును మించిన సంపద లేదు' మకుటంగా రాసిన 108 పద్యాలలో పదాల మాధుర్యంతో భావ గాంభీర్యం చోటు చేసుకుంది. వేమన చెప్పినట్టు "చదువు మర్మమెరిగి చదివిన చదువురా" సందేశాన్ని అందుకుని చిన్నారి వైష్ణవి, చదువును అక్షర రూపంలో కీర్తించటం, జ్ఞాన సంపదను స్ఫూర్తింపచేయుటం సందేశాత్మకంగా నడిపించారు.






ప్రతులకు: డి. ప్రవీణ్‌కుమార్ శర్మ
జడ్.పి. ఉన్నత పాఠశాల, తడపాకల, ఏర్గట్ల మండలం,
నిజామాబాద్ జిల్లా. సెల్: 95535 76697

**"ఈ రోజుల్లో పుస్తకాలలోని చదువును చదువే వాళ్ళు తక్కువ**
**సోకులకు అలవాటు పడే వాళ్ళు ఎక్కువ**
**చిరిగిన చొక్కా అయినా తొడుక్కో**
**కానీ మంచి పుస్తకం కొనుక్కో"** అంటూ వైష్ణవి సరళవ చనంలో "పుస్తకంతో నా జన్మ ధన్యం, తన సాహిత్య వారధికి అక్షరమే సారధిగా అమృతతుల్యమైన రచన అతి పిన్న వయసులో అందించటం అభినందనీయం. అమ్మ ప్రేమతో ఆరంభమైన 'చిన్నారి కథలు' మరొక రచనలో 30 కథలున్నాయి. ప్రతీ కథకు, పిల్లలకు ఆసక్తి కలిగించే ఇతివృత్తాలకు సంబంధించిన శీర్షికలున్నాయి. సెల్‌ఫోన్లు, చదువుకోవటం, ఉపాధ్యాయుల మందలింపు, దురాశ కల్గించే చేటు, మానవత్వం, దేశసేవ, సంస్కారం, పట్టుదల పక్షుల అవసరం, పల్లె గొప్పతనం, ఆడపిల్ల చదువు, సమానత్వం అన్నీ పిల్లలకే కాదు పెద్దలకీ జీవిత సత్యాల సందేశం అందిస్తున్నాయి. కొన్ని కథలు ఒక పుటలో సగం కూడా లేకుండా ముగించగలగటం వైష్ణవి, సృజనాత్మక ఆలోచనలకు అద్దం పట్టోంది. పిల్లలకు మంచి అలవాట్లు, మంచి భవిష్యత్ కలిగించే ఆలోచనలు చక్కని కథా రూపాలుగా ఆకట్టుకుంటున్నాయి. మనుషుల స్వార్థం, ఈర్ష్య భూమిని నాశనం చేస్తున్న కథనం ఋషి రెండు పక్షులు అద్భుతంగా తెలియచెప్పింది.



-జయసూర్య
సెల్: 9440664610

# నువ్వో అందమైన పూదోట

అరచేతిలో కనుపాప చేసిన నాన్న
తనలో సగమై
గారాలు కురిపించిన అన్న
అమ్మకు మరో రూపంగా అక్క
నువ్వో అల్లిబిల్లి రాగాల పూదోట
స్వర్గపు అంచులు అందుకున్న ముద్దుల చెల్లివి.
నాన్న చాటు బిడ్డైనా
అమ్మ కొంగు విడువని పసికూన
గోరు ముద్దలు
పెట్టిన వేలినే కసుక్కున కొరికే
చిలిపి చేష్టవు
చిరు కోపాల చిరునామా
నీటి బుడగలా పేల్చేసే చిచ్చరపిడుగు.

హ్మ్...
ఎన్నెన్ని మధురానుభూతులు
మూటగట్టిన బాల్యం నీది
నా ప్రియ స్నేహితా!
నా రౌడీ రాణీ!.
ఎంతటి అందమైన హృదయానివి నీవు
నీ సౌందర్యానికి ముగ్ధులు కాని వారెవరు
ఆ చలాకీ తనానికి పట్టం కట్టనివారెవరు
ఏనాడూ తొణకని నీ వ్యక్తిత్వమే నీ ఆభరణం
ఆ హుందాతనమే నీ ధైర్యం.
మై లవ్లీ దోస్త్!
ఏమై పోయిందో ఆ హుషారు
ఏమై పోయావు ఆ నువ్వు
బహుశా

నీ ఆనందాన్ని చూసి
కాలానికే కన్ను కుట్టిందేమో
అంతా దుఃఖపు వాగు
ఆ ప్రవాహంలో నువ్వు.
అయినా
నువ్వు చూడు
చైనా వాల్ లా నువ్వు
నిన్ను చూసి వడలిన తోటకూరను నేను.
అమ్మ అస్తమయం నుంచి మొదలు
నూరు సుత్తెలు గుండెను మోదుతూనే ఉన్నాయి
నిలిచే సత్తా నీ సొంతం
చూసే ధైర్యం నాకు అలవడలేదింకా.
బాల్య వివాహం బాధ్యతల మోత
నా ప్రియ నేస్తమా!

నీకు తెలుసా
అక్కడే
సరిగ్గా అక్కడే
నిన్ను నువ్వు కోల్పోయావు
నా సజల నయనాలు
ఆనాటి నిన్నే కోరుతున్నాయి.
నునుపైన కొండలు సుదూరాన
అవే ద్యోతకం మన పెద్దలకు
వారి బాధ్యత వదిలింది
అది నీకు గుదిబండ
ఏడడుగుల తప్పిదం
ఏడు జన్మల ప్రాపకం
అనుమానం
అవమానం
అపహాస్యం
అంధకార భవిత
జీవన్మరణ సమస్య
బలవన్మరణ శాసనం.

అప్పుడేగా
నీకూ తెలిసింది
ముళ్ళ గులాబీ చెట్టు మొగ్గేసిందని
చీకటి బతుకులో టార్చ్ లైట్
ఒంటరి పోరు నీ నూతనాశయం.
ఓ నా సఖీ!
ఇప్పుడు నువ్వు
పడి లేచిన కెరటానివి
పసిమొగ్గను హత్తుకున్న పూదోటవు
మరిన్ని గులాబీలకు ఆలవాలము
ఓ నా శ్రీలూ!
నువ్వో సంపూర్ణ వికసిత
నువ్వో సామాజిక స్ఫూర్తి
నువ్వో ఆడపిల్లల ఆదర్శప్రాయవు
నీకిదే నా అక్షరాంజలి
అందుకుంటావు కదూ!



- మేరెడ్డి రేఖ
7396125909



పుస్తక సమీక్ష

# కన్నీటి సరోజం

పలు ప్రక్రియలలో ఎన్నో అంశాలను స్పృశిస్తూ, తనదైన శైలితో సాహిత్యాన్ని పండిస్తున్న సృజనకారుడు ఆచార్యమసన చెన్నప్పగారు. 'ఆర్షకవి'గా ప్రసిద్ధులైన వీరు ఈ మధ్యనే 'సరోజన'అనే నవల ప్రచురించారు. ఇది వారి మొదటి నవల.

ఓ సామాన్య స్త్రీ వ్యథార్థ యదార్థ గాథ. సరోజన కథ మసన చెన్నప్ప హృదయ స్పందన. ఈమె మరెవరో కాదు స్వయాన రచయితకు అక్క. నవలలో కేశవులు అన్న పేరుతో పరిచయం అవుతారు. కష్టాల్లో, బాధల్లో, విపత్కర పరిస్థితుల్లో ఆమెకు తోడుగా ఉండి బాధ్యతగా అవసరమైన పనులను నిర్వహిస్తాడు. ఆమె కూడా తమ్ముణ్ణి ఎంతో ప్రేమగా చూస్తుంది. తమ్ముడికి ఉద్యోగం రావాలని మొక్కులు మొక్కుతుంది ఉద్యోగం

**బొంబాయికి వెళ్ళిన ఆమె జీవితమేమి మారలేదు. ఎప్పుడూ మందు సిగరెట్లు తాగడం భార్యను కొట్టడమే ఆయన పని**

రాగానే తమ్ముని వెంటబెట్టుకుని వెళ్లి మొక్కులు తీర్చుకుంటుంది. తన కొడుకులకు చదువులు అబ్బనందుకు ప్రయోజకులు కానందుకు బాధపడుతుంది తప్ప బయటపడదు.

తన బాధల్లో గొప్ప ఊరట తమ్ముడు. ఆ అక్కకు ఎంతో నమ్మకం తమ్ముని మీద.

అక్క కోసం పాతపట్నం రావడం వలన తనకు ప్రయోజనాలు కలిగాయని చెప్పుకున్నాడు తమ్ముడు. ఇది అక్క తమ్ముళ్ల గొప్ప అనుబంధం.

80 పేజీలు ఉన్న ఈ కథ ఆద్యంతం ఆసక్తిగా చదివిస్తుంది. చివరి 30 పేజీలు మరింత వేదానాభరితమై, ఉద్వేగపూరితమై, హృదయాన్ని ద్రవింప చేసేలా విషాదాంతంగా ఉంటుంది.

కథ ప్రారంభంలోనే ఆత్మహత్య ప్రయత్నం. బావిలో పడింది నిండు గర్భిణి సరోజన. బయటకు తీయడం వలన బతికింది. 'ఇంక నెలాగితే బిడ్డను కనేది. బావిలో ఎందుకు పడ్డదో' అనిఎవరో అన్న మాటకు

'తిన్నదరగక వడ్డది ఏం చేయమంటరు' అన్నది అత్త ఎంకమ్మ. ఎవరైనా మాటంటే పది మాటలు అనే ఆవిడ కోడల్ని మొదటి కానుపుకు పుట్టింటికి కూడా పంపదు. కనికరం లేకుండా అన్ని పనులు చేపిస్తుంది.

దానికి తోడు తాగుబోతు భర్త కొట్టిండు.

తల్లి రామ లక్ష్మమ్మ బిడ్డను చూడడానికి వచ్చి కాన్పుకు బిడ్డను తీసుకెళ్తుంది. తండ్రి బుచ్చయ్య పట్టుదలగల మనిషి బిడ్డ అత్తగారింటికి ఎప్పుడు రాడు. ఎవరి బాధలు కష్టాలు వారే భరించాలనే కర్మ సిద్ధాంతం ఆయనది.

మనుమడు పుట్టినా, నామకరణోత్సవానికి అత్తింటి వారిని పిలవడు.

సత్యనారాయణ కొన్నాళ్ళకు అత్తగారింటికి వచ్చి, అక్కడే ఉండి సాలె పని చేస్తుంటాడు. ఓ రోజు ఎవరికి చెప్పకుండా భార్యను కొడుకును తీసుకొని బొంబాయికి వెళ్ళిపోతాడు.

బొంబాయికి వెళ్ళిన ఆమె జీవితమేమి మారలేదు. ఎప్పుడూ మందు సిగరెట్లుతాగడం భార్యను కొట్టడమే ఆయన పని. ఆమె బీడీలు చుట్టి సంపాదించేది. భర్తను మార్చలేక, అతని వైద్యానికి డబ్బు ఖర్చు పెట్టలేక, విసిగిపోయింది. ముగ్గురు పిల్లల తల్లి కడుపులో మరో బిడ్డ. ఓ రోజు మాంసం వండి పెట్టమన్నాడు. వండి పెడతానన్న వినలేదు. "ఇంత పొద్దుగాల తాగకపోతే ఏమవుతది" అనగానే గుడిసె కప్పు చెక్క పీకి ఆమెను కొట్టాడు. భర్త మాటిమాటికి కొట్టడమే ఆమెను తీవ్రమైన వేదనకు గురి చేసింది.

ఇక భరించలేక ఓ రోజు మూడు సంవత్సరాల విఘ్నేశ్వరిని ఆరు నెలల నిరంజన్ని తీసుకుని చీకట్లో స్టేషన్ దాకా నడిచి హైదరాబాదులోని గౌలిపురాకు వచ్చింది.

కొన్ని రోజులు పెద్ద బావగారి ఇంట్లో ఉండి తర్వాత ఓ చిన్న గదిని అద్దెకు తీసుకుంది.

అకస్మాత్తుగా భార్యా పిల్లలు మాయమవడం జీర్ణించుకోలేని సత్యనారాయణ రోడ్లన్నీ తిరిగి తిరిగి హైదరాబాద్ కు వెళ్లిందని నిర్ధారించుకొని తీసుకురావాలనుకుంటాడు. ఎంతైనా మగవాడు కదా! అహం అడ్డొచ్చి ఆడది ఎలా బతుకుతుంది? మగవాడు లేకుండా చచ్చినట్టు అదే వస్తుందిఅనుకుంటాడు

తన బతుకేదో తాను బతుకుతుంటే, ఓ రోజు సత్యనారాయణ వచ్చి బొంబాయికి రమ్మని పోరు పెడతాడు. ఇత్తడి బిందె చట్టి సర్వ అమ్ముకుని తాగుతాడు. ఇక్కడ ఒక్క నిమిషం ఉండొద్దు వెళ్ళిపొమ్మని గట్టిగా హెచ్చరిస్తుంది ఆమె. ఈ గొడవలన్నీ కొల్కులపల్లికి కేశవులు చేరవేశాడు. విషయం తెలిసిన పెద్దన్న వీరయ్య వచ్చి బావను నిలదీస్తాడు. సత్యనారాయణ బావమరిదిపై చేయి కూడా చేసుకుం టాడు. "చెల్లెళ్లను భర్తలు ఎంత బాధ పెట్టినా కొట్టినా బావల మీద చెయ్యెత్తరాదని వాళ్ళ నాన్న బుచ్చయ్య చెప్పిన మాట గుర్తుకు వచ్చి ఆగిపోయి ఉంటాడు అతను" సత్యనారాయణ అక్కడి నుండి వెళ్ళిపోయి ఓ తెల్లవారుజాము ముగ్గేస్తున్న భార్య మెడలోని మంగళసూత్రం తెంపుకొని పోతాడు. అందరూ పొగైన ఎవరు ఏమి చేయరు. ఎంతైనా నగరం కదా! ఎవరికి వారే యమునా తీరే! ఎవరి గోల వారిదే! ఎవరి బాధ వారిదే!

సరోజన ధైర్యవంతురాలు. ఆమె తాళి లేకుండానే తిరుగుతున్నది. ఎవరేమనుకుంటారని ఆలోచిం చలేదు. కొందరి మాటల వల్ల కేశవులు కూడా అక్కతో ఈ విషయంలో గొడవపడ్డాడు. "నన్ను విసిగించకు నువ్వు నా దగ్గర ఉంటే ఉండు. లేకపోతే పో, ఎవరు నాకు లేరనుకుంటాను" అంది. అందరూ తనకు బుద్ధులు చెప్పే వారేనని బాధపడింది. లోకం కోసమన్నా పసుపుతాడు మెడలో వేసుకోమన్న కేశవులు చెంప మీద ఒకటి అంటించింది కూడా. ఎవరు చెప్పినా ఆమె వినే పరిస్థితిలో లేదు. మనసు విరిగిపోవడం అంటే ఇదేనేమో..!? కేశవులుకు కూడా కోపం వచ్చి వెళ్ళిపోయాడు. సరోజ మాత్రం చాలా రోజుల తర్వాత ఓ పసుపు తాడు మెడలో వేసుకుంది.

భర్త తనకు చెప్పకుండానే ఒకే ఇంటి అక్కాచెల్లెళ్లను తెచ్చి ఇద్దరు మగ పిల్లలకు పెళ్లి చేశాడు. బొంబాయికి రామాయంపేటకు తిరుగుతున్నాడు తప్ప మరెప్పుడు భార్య దగ్గరికి రానేలేదు. భర్త చనిపోయినప్పుడు ఆమె బాధ పడలేదు. ఏడవ లేదు 'రాక్షసులు చనిపోతే దేవతలు ఎందుకు బాధపడాలి?' కట్టుకున్న భర్తతో ఎన్నో కష్టాలు పడింది. జీవితంలో ధైర్యంగా నిలదొక్కుకుంది.

గౌలిపురాలోని అమ్మాయితో (ప్రమీల) కేశవులుకు పెళ్లి నిశ్చయమైనప్పుడు ఎంతో సంతోషించింది. కానీ ఎవరికీ చెప్పకుండా జగద్గిరిగుట్టకు వెళ్ళిపోయింది. అందుకు కారణం ఒకరి ఇంట్లో తాను పనిచేస్తున్నానని పెళ్లి వాళ్లకు తెలిస్తే, పెళ్లి ఆగిపోతుందని భయం. పెళ్లికి కావలసిన ఏర్పాట్లు పనులన్నీ తానే దగ్గరుండి చూసుకున్నది.




– మసన చెన్నప్ప
సెల్:9885654381

పిల్లలిద్దరూ ఎదిగారు. కొడుకు నిరంజన్ కు చదువు అబ్బలేదు దర్జీ పని చేసుకుంటున్నాడు. కూతురు ఉపాధ్యాయునిగా ఉద్యోగం చేస్తుంది. 30 ఏళ్ళు దాటిన పిల్ల పెళ్లి చేసుకోనంటుంది. ఆమెకు జ్యోతి స్నేహితురాలు. ఆమె అంటే అంతులేని అభిమానం. ఆమె ఓ స్మగ్లర్ స్మగ్లింగ్ గూడ్స్ అమ్ముతుంది.

విఘ్నేశ్వరీ బంధువులకు వాటిని అమ్మాలని చూసేది. ఒక బంధువు కొనకుండా నిరాకరించినందుకు, స్నేహితురాలికి అతని మీద లేనిపోనివి చెప్పింది. ఆమె మాటలతో ఆ బంధువు దగ్గరికి వెళ్లి నా స్నేహితురాలిని అవమానిస్తావా అంటూ షాపు అద్దాలు పగలగొట్టి వచ్చింది. అంతటి ఉద్వేగపూరితమైన విధ్వంసకరమైన మనస్తత్వం ఆమెది. వయసుతోపాటు కోపం ఆవేశం మొండితనం మూర్ఖత్వం ఆమెలో పెరిగాయి.

ఆమె ఎవరినో ప్రేమిస్తుందని తెలుసుకున్న కేశవులు అతని దగ్గరకెళ్ళి పెళ్లి ప్రస్తావన తెస్తాడు. అతడు తనకిదివరకే పెళ్లయిందని, ఇద్దరు పిల్లలు ఉన్నారని, తనను క్షమించాలని ఇదంతా జ్యోతి వల్లే జరిగిందని తప్పుకున్నాడు.

విఘ్నేశ్వరీ గట్టిగా జ్యోతిని నిలదీస్తే ఆమె కూడా సారీ చెప్పి తప్పించుకున్నది. కొన్నాళ్లకు స్మగ్లర్ అయిన జ్యోతి అనుమానాస్పదంగా చనిపోయింది. ఈ సంఘటనతో ఆమె ఎవరిని నమ్మకుండా ఎవరితో

**సరోజన ధైర్యవంతురాలు. ఆమె తాళి లేకుండానే తిరుగుతున్నది. ఎవరేమనుకుంటారని ఆలోచించలేదు**

స్నేహం చేయకుండా ఉన్నది.

తాను డ్యూటీకి వెళ్లడానికి గంటల తరబడి తయారయ్యేది. ఎంతో సేపు భోజనం చేసేది. అయినా తల్లి ఏమనేది కాదు. అన్నింటినీ ఓర్చుకునేది.

తమ్ముడి నిరంజన్ పెళ్లి తర్వాత, ఒక బ్యాంకు ఉద్యోగితో వివాహం జరిపించాడు కేశవులు. తనకు ప్రభుత్వ ఉద్యోగం భర్తకు బ్యాంకులో ఉద్యోగం.మంచి జీవితం.అయినా ఆమెకు తృప్తి లేదు.

సరోజమ్మ కష్టాలు ఇంకా తీరలేదు.

చద్దన్ననీ పాచిపోయిన అన్నం తిని, వేడివేడిగా కూతురుకు తినిపించి, పెంచి పెద్దచేసి, చదువులు చెప్పించిన ఆ తల్లి కష్టం బిడ్డకు గుర్తులేదు. గుర్తురాదు. తల్లి మీద కానీ తమ్ముడి మీద కానీ కాస్తయినా మమకారం లేదు. అమానుషమైన ప్రవర్తన.

శత్రువు ఎక్కడున్నా అప్రమత్తంగా ఉండొచ్చు. పగోడు పక్కనుంటే తొలగిపోవచ్చు. కానీ కన్నబిడ్డనే విపరీత మనస్తత్వంతో,

స్వార్థంతో నగం ఇల్లు ఆక్రమించుకొని రెండంతస్తుల భవనం కట్టుకొన్నా, మిగిలిన సగభాగం కూడా కావాలని తల్లిని తమ్ముడిని మరదల్ని రోజు వేధించి, చివరికి తల్లి చావుకు కారణమైంది.

అయినా ఆమెలో మార్పులేదు. ఇంకా పగ పెంచుకుంది. కోర్టులో కేసు వేసి,అనుకున్నది సాధించుకుంది. తాగి తాగి చెడు అలవాట్లతో తమ్ముడు చనిపోయాడు.

తాను ఎంతో అభిమానించే అక్క చనిపోవడం, తర్వాత కొన్ని సంవత్సరాలకే అర్ధాంగి దూరమవడం కేశవులు జీవితం కూడా దుఃఖ సముద్రం అయింది.

ఈ సందర్భంగా మసనచెన్నప్ప గారు రాసిన కవితా పంక్తులు స్మరించుకోవడం సమంజసంగా ఉంటుందేమో ! "అర్ధాంగివను మాట అర్ధసత్యమే కానీ పూర్ణాంగివనుటయే పొసగు నాకు" రచయితకు అత్యంత ఇష్టులైన ఇద్దరు ఈ లోకం విడిచి వెళ్ళారు.

'సరోజన' నవలలో రచయిత తన అక్కతో తనకున్న అనుబంధంతో ఆత్మీయతతో ప్రేమతో ఆమె కథను

ఉన్నది ఉన్నట్లుగా నవలగా తీర్చిదిద్ది అక్షరాలతో శ్రద్ధాంజలి ఘటించారు. "ఇలలో జరిగినవే కలలో వస్తాయి" అక్క కోరిక ప్రకారము ఆమె కన్నీటి చరిత్రను అత్యంత సరళంగా సూటిగా స్పష్టంగా విసిగించకుండా చెప్పడం బాగుంది.

లోక పరిశీలన జీవితా నుభవంతో సజీవమైన పాత్రల ద్వారా మనుషుల ఆలోచనలను ఆయా సందర్భాలలో వారి ప్రవర్తనను మనస్తత్వాన్ని రచయిత చక్కగా ఆవిష్కరించారు. అక్కడక్కడ అలాంటి వాక్యాలను మనం చూడవచ్చు. ఉదాహరణకు పేజీ 3లో బతుకు మీద విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయినప్పుడు మాత్రమే ఎవరైనా ఆత్మహత్యకు ప్రయత్నం చేస్తారు. మామ పీడ విరగడయింది. అత్త శనిలా దాపురించింది. పేజీ 11 లో ప్రాచీన భారతంలో గృహినికి గల ఇంటి పనులు ఊపిరి సలపనివ్వవు. పేజీ21లో ఏటిలో పిసికిన చింతపండయ్యింది. పేజీ 26లో ఏ గూటి పక్షులు ఆ గూటికే చేరుతాయన్న సామెత రుజువైంది. పేజీ68లో పూర్తిగా పగ పట్టిన పాముల వ్యవహరించింది. పేజీ 70లో నడి సముద్రంలో నావలాగా వారి జీవితం అస్తవ్యస్తమైంది. ఇలా చాలానే ఉన్నాయి. నవల చివరి 5 పేజీల్లో నవలా సారమంతా కనిపిస్తుంది. ఆధ్యాత్మిక చింతన, తాత్విక భావన, కర్మ సిద్ధాంతం, వారసత్వంగా వచ్చే అలవాట్లు వీటన్నింటి గురించి చక్కగావిశ్లేషించారు రచయిత.

నిరంతరం ఆధ్యాత్మిక చింతనతో, సాహిత్య సేవలో, ఆదర్శ జీవితం గడుపుతున్నవారు ఆచార్య మసన చెన్నప్పగారు.వారి కలం మరిన్ని నవలను పండించాలని ఆశిద్దాం.



– గడ్డం సులోచన
7702891559.

## కవితార్చన



అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..
-సంపాదకులు

### మానవ నైజం

విషపు ఆలోచనలకు
ధవళ వస్త్రం కప్పి,
ముఖానికి చిరునవ్వులు
పులుముకుని ఎదురు నిలిచే
సమాజం ఇది..!.
అవసరం స్నేహ గీతం అవుతుంది..!
ఆలోచనలు తేనె పూసిన
కత్తులై ,ఆప్యాయంగా పలకరిస్తాయి..!.
సహాయం చేసే చేతులు
అభిమానంగా స్పందిస్తే నీవు
దయామూర్తివివై పోతావు..!.
నిరాకరణ రాజ్యమేలితే
హృదయాలు భగ్గు మంటాయి...!.
అప్పటి వరకు మేక తోలు
కప్పుకున్న పులులు నిజరూపం
దాల్చుతాయి...!.
"అందితే..జుట్టు అందకపోత.. కాళు
పట్టుకునే నైజం
మనిషి ప్రవృత్తి లో భాగమై
సమాజంలో
స్థావరం ఏర్పాటు చేసుకుంటుంది.
ఏడుపుతోనే ఈ లోకం లోకి వచ్చే
మనిషి , దుఃఖంతో సహజీవనం చేస్తాడు!
కష్టాల కొలిమిలో కాగిన మనిషి ,
సమ్మెట దెబ్బలతో లక్ష్యాల
తీరాలకు చేరతాడు..!.
ఆటుపోట్లు జీవన సంద్రంలో
చుట్టం చూపుగా వచ్చి పోతుంటాయి..!.
కష్టాలను సుఖాలను సమపాళ్లలో
స్వీకరించి నిలదొక్కుకున్న వాడే
మహోన్నతుడు..!.
చెరువులో నీళ్లు ఉన్నప్పుడే కప్పలు చేరినట్లు,
సమాజం లో స్థాయి పెరిగి నప్పుడే
బంధువులు చేరుతారు..!.
అనురాగాల గాలిపటాలు
అక్కడ సుడులు తిరుగుతాయి,
ఆప్యాతల కిటికీ రెక్కలు తెరుచు కుంటాయి...!
నిరాసక్తత ప్రవహిస్తే సూటిపోటి
మాటలు నడుచుకుంటూ వస్తాయి..!
కాచిన చెట్టుకేగా రాళ్ళదెబ్బలు.
పరుల స్వార్థం లో కొట్టుకు
పోక ఆచితూచి అడుగులు
వేసి,బంధుగణాన్ని కలుపుకు
పోవడమే మనిషి ముందు
ఉన్న కర్తవ్యం..!

-కాకర్ల రమణయ్య
9989134834

### నలుపు నుంచి తెలుపు వైపుకు

ప్రతి మనిషిలో ఉంటాయి..
నలుపు తెలుపు రెండూ..
మారుతూ ఉంటాయి అవి చూసే చూపుని బట్టి..
నలుపు తెలుపు రంగులు కాదు..
జీవన నౌక చుక్కానులు..!
గతాన్ని గాలికొదిలేసి..
తెల్ల కాగితం మీద చుక్కల్ని కలుపుతున్నంత
తేలికదా
జీవితం అంటే.. కాదు..!
నల్లని నేలపై పచ్చని కళ్ళాపి చల్లి..
తెల్లని ముగ్గుతో..మెలికల ముగ్గులు వేసినంత
కళాత్మకంగా ఉండాలి జీవితం అంటే..!
ఏం రాసుకుంటే అదే ఉంటుంది...
జీవితం అనే
తెల్ల కాగితం..!
తెల్ల కాగితం
ఎన్నో రంగులు నింపుకుంటూ
పోతుంటుంది...
నలుపంటే రంగు కానే కాదు...
అన్ని రంగుల మిశ్రమం 'తెలుపు' అయితే...
రంగు ఏమీ లేకపోవటమే 'నలుపు'...!
కాంతిని ప్రతిఫలించేది తెలుపు అయితే..
కాంతిని తనలో కలిపేసుకునేది నలుపు.!
తెలుపు స్వచ్ఛతకి చిహ్నము..
మరి దాన్ని చూపే కనుగుడ్డు నలుపు..!
కనుముక్కు తీరు చక్కగున్నా..
నల్లగా ఉందంటూ విముఖతెందుకు..!
మనసంతా మసకబారినా..
పాలరాతి బొమ్మంటూ బిరుదులెందుకు..!
తెల్లని ఆ చందమామలో
ఆ నల్లని మచ్చ ఎందుకు..!
నిశీధి నుంచి వెలుగు వైపు...
పతనం నుంచి ఉన్నతం వైపు...
అంధకారం నుంచి అరుణగ్రహం వైపు
అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు...
చీకటి ఛాయల నుంచికాంతి రేఖలవైపు
సూర్యోదయంకాకముందే
నల్లని చీకటి తెరలు విప్పక ముందే..
ఆకలిని తీర్చే వృత్తిపనికి బయలుదేరితేనే కదా ..
బతుకు లో తెల్లని వెలుగులు కాన వచ్చేది..!
అందుకే బ్రతుకు బండి లో నవ్వుతూ
సంతోషం గా పయనం చేద్దాం ..!

-ఓగిరాల గాయత్రి
9492308725

### బ్రతుకు పోరాటం

పొద్దు పొడవగానే సూర్యుడికి సలాం కొట్టి!
బుక్కెడు బువ్వ కోసం
బుగ్గలమ్మ కొనుచు!!
బ్రతుకు కొరకు పోరాటం!
గుండెల్లో బడబాగ్ని దాచుకొని
పెదాలపై చిరునవ్వు!!
రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు!
నాలుగు రాళ్లు సంపాదిస్తేనే గాని
పొయ్యిలో పిల్లి లేవదు!!
బుగ్గల కోసం బేరం చేసేవారు కొందరు!
బుగ్గ లాంటి అమ్మాయి కోసం
వెకిలి చూపులు చూసేవారు కొందరు.!!
అన్నింటిని ఎదుర్కొంటూ దుఃఖాన్ని దిగమింగుకుంటూ!
నడిరోడ్డు మీద నిలబడ్డ దీన పరిస్థితి.!!
ఈ అసహాయ పరిస్థితికి
కారణమేమిటో తెలియదు ఆ తల్లికి.!
డబ్బులు సంపాదించడం ఒక్కటే ఆమె లక్ష్యం.!!
ఈ పూట తన వారి కడుపు నింపాలి.!
రంగురంగుల బుగ్గలు అమ్మడం మాత్రమే
తెలుసు ఆమెకు.!!
ఊసరవెల్లిలా రంగులు మార్చే
బడా బాబుల గురించి తెలియదు.!
తెలిసిన ఏమి చేయలేని పరిస్థితి.!!
అన్నిటిని ఎదుర్కొనే ధైర్యము ఇవ్వమని
భగవంతుని కోరుకుంటుంది ఆ తల్లి!
అంతకన్నా మించి ఏం చేస్తుంది.. పాపం!!

-ముదిగొండ రమాదేవి
+91 99890 38762

### ఆసరా అందించేది ఎవరు

సృష్టికి మూలం నేనేనని అలరాడుతున్న ఉదరం లోనే
ఊచకోతకు గురవుతున్న నేనున్నానని ఆసరానందించేదేవరు?.
అంబరాన స్వేచ్ఛగా విహరించలని కలలు కంటున్న నా ఆశల రెక్కలను
రాబందులు తమ కబంధహస్తాలతో తుంచగా నా శ్వాసకు ఆదెరువెవ్వరు?.
ఆంక్షల వలయంలో చిక్కుకొని నా ఉనికే ప్రశ్నార్థకంగా మారిన వేళ
ఆదుకునే ఆప్తులెవ్వరు?.
ప్రతినిత్యం వివక్షకు గురవుతూ మూడురోజుల తన బాధను సైతం పంటికింద
అనుచుకొని సపరియాలు చేసిన అర్థం చేసుకుని ఆదరించే తోడెవరు?.
కొవ్వొత్తి వలె కరుగుతూ తన వారికి వెలుగు నింపిన
తన త్యాగనిరతిని గుర్తించేదేవరు?.
నా ప్రస్థానాన్ని ప్రశంసించి నా ఉనికినే నిర్వీర్యం చేస్తున్న
ఈ సంఘాన్ని ప్రశ్నించే సాహసి ఎవరు?
ఇలా నా మస్తిష్కంలో వేవేలా ప్రశ్నలు ఆవిష్కృతమవుతున్న
సమాధానానికై ప్రతినిత్యం ఎదురుచూస్తూ
ఎదకోతను అనుభవిస్తున్న పడతిని నేను...

-కొత్తప్రియాంక,
+91 95533 52929

### పాల నురుగు

తేనె కన్నా మధురమని
రంగురంగుల సీతాకోక
చిలుకనై జుర్రుకోవాలని
ఊహల తోటలో విహరించా.
అందమైన రోజాలా నన్నహ్వానించి
గులాబి ముల్లై నను గుచ్చింది
సాలె గూటిలో చిక్కిన
సాలె పురుగయ్యింది బ్రతుకు.
ప్రేమ,వేదన రెండూ మానస పుత్రులే
ప్రేమ అనురాగం తో జతకూడి
మమకారమనే పొదరిట్లో చేరి
బంధాలు,అనుబంధాలతో
ఇంటిని స్వర్గం చేస్తుంది.
వేదన పురుడోసుకుంటే
నిర్లిప్తత,నిరాశతో స్నేహం చేసి
మనుసును చంపి ,ఒంటరిని
బ్రతుకును ఎడారిమయం చేస్తుంది
ప్రేమ నమ్మకంతో జీవం పోసుకుంటే
అపనమ్మకంతో మరణిస్తుంది...

-హేమలత
+91 96667 79103

## నిన్ను చూస్తూనే...

నిన్ను చూస్తూ నవ్వు కుంటాను
నిన్ను చూస్తూ తిట్టుకుంటాను
నిన్ను చూస్తూ కోపగించుకుంటాను
కొన్ని సార్లు ద్వేషిస్తాను
పక్కనెవరున్నా పట్టించుకోను.
ఆకలి అయినప్పుడు అమ్మ వైపు చూస్తాను
డబ్బులు కావాలన్నప్పుడు
నాన్న వైపు చూస్తాను
నువ్వు నాదగ్గరుంటే
నాకింకెవ్వరూ కనిపించరు!.
నేను కూర్చున్నా నిలబడ్డా నడుస్తున్నా పడుకున్నా
నీముఖంలో ముఖం పెట్టి చూడకుండా ఉండలేను!
నిన్ను చూస్తూ కూర్చుంటే ...
ఏం తాగుతున్నానో తెలియదు
ఏం తింటున్నానో కూడా తెలియదు
ఇక రుచి అంటావా?
నీ మాయలో పడి అది ఎప్పుడో మరచిపోయాను!.
నిన్ను చూస్తూ నడుస్తుంటే...
ఎవరో తెలియజేస్తే కానీ నా గమనం తెలియదు
ఎవరో గుర్తుచేస్తే కానీ నా గమ్యం తెలియదు
ఎదురుగా వస్తున్న వారెవరూ కనిపించరు
స్పీడ్ గా వస్తున్న ట్రక్ కూడా
సడెన్ బ్రేకులు వేయాల్సిందే!
'ఇంట్లో చెప్పేవచ్చావా?'అంటే
ఈ చెవితో విని ఆ
చెవిలోనుండి వదలేయడమే!.
నాకేమైనా కానీ...
నీకు చిన్న గీత కూడా పడొద్దని
నువ్వే నా లోకంగా
అపురూపంగా చూసుకుంటున్నాను.
కీచుమని రోడ్డుని రాసుకుంటూ
ఆగిన టైర్ల గుర్తులు
ఒక భయంకర శబ్దం తర్వాత
"పాపం ఈ భూమ్మీద
నూకలుచెల్లినయ్ రా "
ఎవరో అన్న మాటలు
నా చెవుల్లో గింగురులు తిరుగుతుంటే...
ఇంకొకడి చేతిలో అపురూపంగా ఒదిగి
వెచ్చగా హత్తుకు పోతూ నువ్వు!.
"అరే మొబైల్ ఫోన్ కి మాత్రం
చిన్న గీతకూడా పడలేదు"
వాడెవడో నిన్ను మురిపెంగా చూసుకుంటూ
అన్న మాటలు
ఈ భూమ్మీద చివరగా....
నేను విన్న మాటలు!





- వేణు నక్షత్రం
సెల్:+1 (703) 861-8368

## మినీ కవితలు

నీ నేత్రాలే నీకు ప్రత్యక్ష సాక్షులు
నీ శ్రమే సదా నీ ప్రగతికి సోపానం
అందుకే
నీ ప్రగతికి నీవే క్రమ శిక్షణతో
సక్రమ బాటను వేసుకో
పరుల చెడు మాటలతో
నీ బ్రతుకును పాడు చేసుకోకు
ధైర్యమే నీకు తోడు

ధైర్యం జీవితానికి భరోసా
భయం మనిషి పతనానికి నాంది

నిన్ను నీవు మార్చుకోడానికి
బ్రతుకులో ఎన్నో నేర్చుకోవడానికి
నీ నిరంతర కృషి కొనసాగుతుండాలి
కానీ!.......
నిన్ను నువ్వు ఏమార్చుకొడానికి మాత్రం కాదు
ఉన్నది ఈ జీవితం!

అవధులు లేని మధుర మైత్రితో,
ఓటమి లేని నిరీక్షణతో
గతించని మంచితనంతో
సదా జీవించు.



-దోస పాటి సత్యనారాయణ మూర్తి
9866631877

## యుద్ధం



యుద్ధం ఎప్పుడు విధ్వంసమే
యుద్ధం ఎప్పుడు ఉన్మాదమే
ఇతిహాసాల్లోకి తొంగిచూడు
చరిత్ర పుటలను త్రిప్పిచూడు
మహాభారతం లో
చివరకు మిగిలింది ఎవ్వరు
రామాయణంలో
వాలిని చంపింది ఎందుకు
విశాల ప్రపంచాన్ని జయించిన
అలెగ్జాండర్ ద గ్రేట్
శవపేటిక నుండి
రెండు చేతులు చాచి
ఇచ్చిన సందేశమేమిటి
కళింగ యుద్ధం పిదప
అశోకుడి లో కలిగిన విరక్తి ఏమిటి
ప్రపంచ అందగత్తె
క్లియోపాత్ర స్వంత తమ్ముణ్ణే
వివాహమాడిన వైనమేంటి
పాము తో కాటేసుకుని
చనిపోవడం ఏమిటి
దశాబ్దాల తరబడి జరుగుతున్న
ఇజ్రాయెల్ పాలస్తీన
గోడ పంచాయితేంటి
రష్యా-ఉక్రెయిన్ ల
సమరం ఇప్పట్లో సమిసేనా
యూదులను ఊచకోత కోసిన
నియంత హిట్లర్ కథ
ఆత్మహత్యతో ముగిసింది కదా
జిహాద్ పేరుతో ప్రపంచాన్ని
ఇస్లామిక్ రాజ్యంగా మార్చాలని
ఎన్ని ఉగ్రదాడులు,
మరెన్ని మతోన్మాదాలు
యుద్ధాలన్ని..అయితే రాజ్యకాంక్ష
లేదంటే ధనదాహం,
కాకుంటే స్త్రీ వ్యామోహం
మత మూర్ఖత్వం ఎలాగూ అగ్నికి ఆజ్యం
ఎన్ని చావులు, ఎన్ని శవాలు
అంగవైకల్యాలు, వైధవ్యాలు, అనాథలు,
ఆకలిచావులు ఇంకెన్ని !



-డా పాక వెంకటేశ్వర్లు
9849436891

## సాహిత్యంలో చరిత్ర పరిచయం

### -వైస్ ఛాన్సలర్ ఘంటా చక్రపాని



సభలో ప్రసంగిస్తున్న కె. శ్రీనివాస్.

క్రమపద్ధతిలో సాహిత్యాన్ని చదువుకుంటూ వస్తే.. అది చరిత్రను పరిచయం చేస్తుందని బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఘంటా చక్రపాణి అన్నారు.ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీఆర్ఎన్ఆర్ కళాశాలలో నిర్వహించిన 'శతజయంతి' సాహితీమూర్తులు దాశరథి-ఆరుద్ర జీవితం, సాహిత్యం' జాతీయ సదస్సు ముగింపు సభకు 'ఆంధ్రజ్యోతి' పూర్వ ఎడిటర్ కె. శ్రీనివాస్, తెలంగాణ ప్రెస్ అకాడమీ మాజీ అధ్యక్షుడు జూలూరు గౌరీ శంకర్‌లతో కలిసి ఆయన హాజరయ్యారు. కవి నేపథ్యం, సామాజిక పరిస్థితులు కాలానుగుణంగా మారుతూ ఉంటాయన్నారు. దాశరథి, ఆరుద్రల సాహిత్యం, పరిశోధనలు ఏదో ఒక పరిస్థితుల్లో చరిత్రలో విస్మరణకు గురయ్యాయన్నారు. కానీ కాలక్రమంలో అవి తెరపైకి వచ్చిన వాటిపై చర్చలు జరుగుతున్నాయన్నారు.

దాశరథి ఉద్యమ నేపథ్యం, ఓ ముఖ్య ఘట్టమని సీనియర్ సంపాదకులు కె. శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ఉద్యమం వచ్చిన తర్వాతే దాశరథి మీద గౌరవం కలిగిందని, తెలంగాణ గురించి తెలుగులో పద్యాలు రాసిన గొప్ప పద్య రచయిత అని శ్లాఘించారు. తెలంగాణ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ దాశరథిని మలి తెలంగాణ ఉద్యమం వచ్చే వరకు పట్టించుకోలేదన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమా మాజీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ దాశరథి ఓ ఉద్యమ జీవితమన్నారు. ఈ సదస్సులో పలు ప్రాంతం నుంచి వచ్చిన విశ్వ విద్యాలయాల ప్రొఫెసర్లు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు 75 పత్రాలు సమర్పించారు.



ఈ వారం అంశం: "యుద్ధం ఎలా పుడుతుంది!"
పేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా॥ రావి రంగారావు 2024 నుండి నిరంతరాయంగా నిర్వహిస్తున్న వారం వారం కవితల వర్క్ షాపులు.
2025 "వారం వారం కవితల వర్క్ షాప్" 18కి మొత్తం 20మంది కవులు తమ కవితలు పోస్ట్ చేశారు. 11 కవితలకు ప్రశంసా పత్రాలు లభించాయి.

-డా॥రావి రంగారావు
9247581825

# వచన కవితలు

## యుద్ధాలు మనసుల్లో పుడతాయి

అసహనం ఆభిజాత్యం
ఈర్ష్య పోటీతత్వం
మనిషిలో రగిలి రగిలి
యుద్ధంగా ప్రకటిత మౌతుంది...
అది కులం రంగూ పూసుకోవచ్చూ
మతం ముసుగూ వేసుకోవచ్చూ.
ఒకడు ప్రపంచాన్నే జయించాలని,
మరొకడు
సంపదలు దోచుకోవడానికి,
ఇకొక్కడు
మతం వ్యాప్తి చేయాలని,
దారుణ మారణ హోమాల
యుద్ధాలు చేశారు...
రాజులంతా
రాజ్యాలు విస్తరించుకోవాలని
అన్నదమ్ములు
రాజ్యాల కోసం యుద్ధాలు చేశారు
రక్తపు టేరులు పారించారు
పోరు నష్టం పొందు లాభం అని
పెద్దలు చెప్పినా
యుద్ధాలు ఆగడంలేదు..
యుద్ధం ఒకరి వ్యసనం,
యుద్ధం మరొకరి అవసరం,
ఏది ఏమైనా మానవ ప్రాణాలు హననం...
శాంతిని బోధించిన బౌద్ధం వల్లనే
జాతి బలహీనమై
విదేశీ దండయాత్రలు ఆపలేకపోయింది...
ధర్మం నిలబెట్టడానికే
యుద్ధం చేయమన్నది గీత,
శాంతి కోరే దేశాలు కూడా
యుద్ధం చేయక తప్పడంలేదు,
యుద్ధ ఫలితం మాత్రం
విషాదమే తీవ్రనష్టమే...
యుద్ధానంతరం
జాతి పునర్నిర్మాణం ఎంతో కష్టం,
అందుకే ఆచి తూచి అడుగెయ్యాలి,
అడుసులో కాలు పడకుండా
జాగ్రత్త పడాలి

-అనుముల బదరీనారాయణ,

## రక్త చరిత

యే యుద్ధం చూసినా
ఏమున్నది గర్వకారణం
నేల కూలిన
ఆశల భవంతులు తప్ప,
నేల రాలిన..
పడతుల కుంకుమ తిలకాలు తప్ప,
మారు మ్రోగే క్షతగాత్రుల
ఆర్త నాదాలు తప్ప...
మనసులు కలచివేసే
విగత దృశ్యాలు తప్ప,
అనామకుల అంతిమ యాత్రలు
అయినోళ్ల అంతులేని
ఆవేదనలు తప్ప...
యుద్ధమంటే
రాజుకొచ్చే రొచ్చు తలంపుకి రూపం,
మంత్రి ఆడే మాయా జూదం,
యుద్ధమంటే.. ఆకలి
ఒకరి అధికారపు ఆకలి
మరొకరి అహంకారపు ఆకలి
ఒకరి అసూయపు ఆకలి
మరొకరి అవమానపు ఆకలి...
హక్కు..
అధికారం రంగు పులుముకున్నప్పుడు
అహంకారం పెరిగి అంధత్వంలో ఒరిగి
ఆవురావురు మంటుంది యుద్ధపు ఆకలి...
యుద్ధం రాజ్యాధికారానికై
రగిలిపోయే రక్కసి,
రాజు మనసుకి అద్దం,
కానీ చిత్రం...
ఎంతటి జగజ్జేత అయినా చివరికి
కోరేది ప్రేమ శాంతి....
అలెగ్జాండర్ జగతిని జయించాడు
చివరకి ఖాళీ చేతులు చూపాడు
అశోకుడు హింసా నదిలో మునిగాడు
చివరికి అహింస పాదాలు కడిగాడు...
నాటి హిట్లర్ సద్దాం హుస్సేన్ నుండి
నేటి పుతిన్ నేతెన్యాహుల వరకు
అందరూ యుద్ధానికి కట్టు బానిసలే
చివరకి చరిత్రలో చెరగని రక్తపు మరకలే

-రాజ్ తొర్లపాటి

## సహనం కోల్పోతే

అహంకారపు మబ్బులు కమ్మిన వేళ,
అన్యాయపు చీకట్లు చుట్టిన వేళ,
అనుభూతుల గోడలు కూలిన వేళ,
అన్యోన్యతా విత్తనాలు ఎండిన వేళ.
స్వార్థపు సుడులు ఊపిరి తీసిన వేళ,
సత్యం మసకబారిన చీకటి వేళ,
సమరశంఖం మోగిన నిశ్శబ్ద వేళ,
సమాజం శోకసంద్రంగా మారిన వేళ.
కన్నీటి నదులు ప్రవహించిన వేళ,
కలలే కాదు, జీవితం చీలిన వేళ,
కరుణా కిరణాలు మాయమైన వేళ,
క్షణాల్లో నాశనం నాటిన వేళ.
శాంతి పాదాలు మళ్లీ నడవాలంటే,
మనసుల్లో ప్రేమ విత్తనాలు నాటాలి,
మానవతా మూల్యాలు మసకబారక,
మాటల మాయాజాలం విస్తరించక.
అప్పుడు మాత్రమే యుద్ధం పుట్టదు,
శాంతి భ్రాంతిగా నిలుస్తుంది.

-డా. భరద్వాజ రావినూతల

## యుద్ధాలు పలు విధాలు

వెనుక వచ్చిన వారు
తమ బిందెను ముందు పెడితే
మొదలు కుళాయి వద్ద నీళ్ల యుద్ధం..
పక్క వసారా నుండి
చెత్త ఎగిరి ఈ ఇంట్లో పడితే
మొదలు అమ్మలక్కల మధ్య
మాటల యుద్ధం ..
తండ్రి విల్లులో
చిన్న వాడికి కొంచెం ఎక్కువ ఇస్తే మొదలు
అన్నా తమ్ముల మధ్య వాటాల యుద్ధం.
ధర్మ రాజు రాజసూయ యాగం చేసి
రాజులతో జేజేలు పొందాడన్న
అసూయతో
రారాజు సృష్టించిన భారత యుద్ధం..
దాయాది దేశం
అభివృద్ధిలో దూసుకు పోతుంటే
కుళ్ళుతో భరించలేని
చుట్టూ ఉన్న ఉన్మాదులు చేసే
చాటు మాటు దాడుల యుద్ధం..
ఆయుధాలను తయారు చేసే అగ్ర
రాజ్యాలు
తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి
సృష్టించే జాతుల యుద్ధం..
కానీ మనిషి మనుగడ కే ముప్పు వస్తే
చేయక తప్పదు కొన్ని యుద్ధాలు ?
యుద్ధం ఏదైనా
చివరకు మిగిలేది
అశాంతి..
ధన, మాన, ప్రాణాల నష్టం
వికాసపు తిరోగమనమే కదా..

-శ్రీనివాస శాస్త్రి.

## 'యుద్ధం మితి మీరిన ఉన్మాదం!

'మాట - మంతి'కి కాలం చెల్లిపోయీ
మనిషి మనిషికీ మధ్యన 'మంట'లుచెలరేగుతుంటే
అంతరంగ' కుహరాలు
'అణువిస్ఫోటన' కేంద్రాలై రగులుతుంటే
'సిద్ధాంతా'ల రాపిడిలో
'రాద్ధాంతా'ల పిలకలు 'పుట్టు'కొస్తుంటే
మతమౌఢ్యం 'మానవత'ను అధిగమించీ
'ఉగ్రవాదా'నికి ఊతమిస్తుంటే
'యుద్ధం' అనివార్యమవుతుంది...
'సమత - మమత'ల బ్రతుకు బృందావనిలో
'స్వార్థం - సంకుచితత్వ'పు విషపు
మొక్కలు మొలుస్తుంటే
'శాంతి, సామరస్యం' అడుగంటిపోయీ
'అంతర్యుద్ధా'ల అగ్ని సెగలు
ఆకాశాన్నంటుతుంటే
'కులమతాల' కుళ్ళు
అన్నదమ్ముల్లాంటి మనుషుల మధ్యన
ఆరని 'కుంపట్ల'ను రాజేస్తుంటే
'సిగపట్ల'కు ప్రేరేపిస్తుంటే
'యుద్ధం' అనివార్యంకాక మరేమవుతుంది!
పెల్లుబికే 'ఆవేశం' మాటున.,
'ఆలోచన' కనుమరుగైతే
ఆర్థిక, సామాజిక 'అసమానత'లు
అంతకంతకూ అధికమవుతుంటే
'అసహనం' పెల్లుబుకుతుంటే
'యుద్ధం' తథ్యమే మరి...
'నియంత'ల చెవులకు
'నీతివాక్యా'లు రుచించవు!
'రక్తం'తో తడిసి ముద్దయిన నేలన
'అహింసా' సూక్తులు వికసించవు!
తప్పని పరిస్థితుల్లో
'యుద్ధం' చేయవలసి వచ్చినా
'నిజం' నిష్ఠూరంగానే ఉంటుంది
యుద్ధం'...
మితిమీరిన 'ఉన్మాదం'...
వినాశకర 'విధ్వంస'క విన్యాసం..
'రక్తం' ఏరులై పారే 'రణతంత్రం'..
శృతిమించిన 'రాజ్యదాహం'...
రగిలే 'రావణకాష్టం'...

-రాయపురెడ్డి సత్యనారాయణ

తొలి శ్వాస నుంచి తుది శ్వాస వరకు
జరిగే దంతా జగడమే
జరా మరణ సమరమే.
గోరు ముద్దల వేళ మారాములతో
అక్షరం దిద్దేవేళ ఆకతాయితనాలతో
కుర్రతనాన జోరులో వెర్రిమొర్రి వేషాలతో
పొట్ట తిప్పల పోరులో
అధికారుల హమేషాలతో
పొత్తుకుదరక చేసేది యుద్ధమే.
ఆలి అరుదెంచిన వేళ
అనురాగ యుద్ధాలతో
మురిపాల ముద్దు లాటలతో
సయోధ్యల రాజీలతో
బాధ్యతల బంధీలతో
సద్దు చేయక చేసేది యుద్ధమే.
ఆస్తులను, అనుభవాలను
పునాదులతో సహా సమంగా పంచేసినా
అనురాగపక్షుల్ని విడతీస్తూ
అనాధని ముద్రేసేస్తూ
ఆశ్రమాలకు తరలిస్తూ
ఆప్యాతలకు తిలోదకాలిస్తూ
హద్దు మీరి చేసేది యుద్ధమే.
వయసు పెరుగుదలతో
జీవక్రియల తరుగుదలతో
మెరుగుదలకై మందులతో
అనునిత్యం చిత్తు చిత్తు గా
మత్తుగా చేసేది యుద్ధమే
-కరుగుతున్న కాలగతిలో
అనుభవాల జ్ఞాపకాల్లో
జారుతున్నపుడే జాగృతమవుతుంది
కురుక్షేత్రాన్ని మించిన యుద్ధం
దేహంలోనే కాదు సుమా
మనసులోతుల్లో దాగుందని
మస్తుగా మనమంతా చేసేది
మనసుతో అలుపెరగని యుద్ధమని

- గోలి మధు

## మేం యుద్ధోన్మాదులం?!!

వనరులు తరిగితే
మనసులు విరిగితే
ద్వేషం రగిలితే
అసూయ అంకురిస్తే
అశాంతి పెచ్చు పెరిగితే
యుద్ధానికి సన్నద్ధులౌతాం...
పంచేంద్రియాలకు బానిసల మని
మమ్ము మేమే వంచన చేసుకోకుండా
"కర్మేంద్రియాల దుష్కర్మలే
ఆనందానికి మూలం" అనే భావనే
మా యుద్ధ నిజనాటకానికి నాంది,
మానవ మారణ హోమమే ప్రస్తావన,
తద్వారా జీవావరణ మరణమే భరతవాక్యం?!!
మాలో దారిద్ర్యం తాండవిస్తున్నా
కష్టపడి పనిచేయడానికి ఇష్టపడం,
పచ్చగా ఉన్న ఎదుటి వాడిని
బిచ్చగాడిగా మార్చే దాకా నిద్దుర పోం,
చీమల్లా ముందుకు సాగే వారిని అనుసరించం,
ఎండ్రకాయల్లా వెనుకకు లాగుతాము!
యుద్ధం పేరుతో మిమ్మల్ని మట్టుపెట్టడానికి
కూర్చున్న కొమ్మనైనా నరుక్కుంటామునిశ్రీ!
సంతోషంగా ఉన్న వాడిని
దుఃఖాక్రాంతుడిగా చేయడం
ఐశ్వర్యవంతుడిని దరిద్రుడిగా మార్చడం
కీర్తివంతుడికి అపకీర్తి పాలు పంచడమే
మా యుద్ధానికి మహా సంకల్పం...
మిమ్మల్ని అంతమొందించడానికి
మేమెంటరులం కాం,
దేశాలు దేశాధినేతలు
కుల మత జాతి ప్రాంతాలు
జీవ శాస్త్రాస్త్రాలు
అణ్వాయుధాలు
ఆరితేరిన యుద్ధవిమానాలు
అతిశక్తివంతమైన జలాంతర్గాంలు
లక్ష్యాలను ఛేదించే క్షిపణులు
మాకు కొండంత అండ...
మానవ అంతరంగ రణరంగంలో
పంచ ప్రాణాలు, ప్రకృతి, ఆత్మ ఒక వైపు...
పంచేంద్రియాలు, అరిషడ్వర్గాలు
మరొక వైపుగా సాగే
ఈ యుద్ధంలో ఏడింటిని ఎండగట్టి
పదకొండింటిని గెలిపించి
ఇహలోక సుఖాలను అనుభవిస్తాం
చస్తే స్వర్గ సుఖాలను చవి చూస్తాం...
ధర్మ సంస్థాపన కొరకు
యుద్ధనాశ్రయిస్తున్నాం
"అరిషడ్వర్గాగ్నికి ఆహుతి అయ్యే శలభాలు"
అని మీరన్నా సరే
యుద్ధమే మా కమితానందం
మేం యుద్ధోన్మాదులం?!!

-తోట వెంకటేశ్వర రావు

## జానెడు పొట్ట కోసం

పోట్లాడుకుంటున్న
ఈ పిచ్చి వాళ్లకు
యుద్ధమా! యుద్ధమా!
నీవు ఎలా పుడుతున్నావో చెప్పవే!.
ఆశ, ఆవేశాల మధ్య
బీజం పోసుకుని
నీతి జాతి మరచిన మనిషికి
కోరికల వలవై పుడుతున్నావని చెప్పవే!
బలహీనుడి మెడ పైకి
బలమైన కత్తిలా దూసుకొచ్చి
ముక్కలు ముక్కలుగ చీలుస్తున్న గొడ్డలిలా
పుడుతున్నావని చెప్పవే!.
కళ్ళనిండా కసి కారుతూ
కటువైన స్వరంతో
పేగులు బయటికి లాగుతూ భుజియించే
బకాసురుడిలా పుడుతున్నావని చెప్పవే!.
పచ్చగా ఉంటే ఓర్వలేక
రక్తం రుచి మరిగి
ఆవురావురు మంటూ తినే
ఉగ్ర కీటకంలా పుడుతున్నావని చెప్పవే!.
కల్లోల పెట్టే కర్కశానివై
కలిగా నీవు కమ్ముకొచ్చి
శవాల గుట్టలను నింపుతున్న
అణు బాంబువై పుడుతున్నావని చెప్పవే!
వెన్న చిలికినట్టే
చిత్రహింసలు పెడుతూ
ఊచ కోతలు కోస్తూ
వికటాట్టహాసాలతో
మీసం దువ్వుతూ
తుపాకీలా పుడుతున్నావని చెప్పవే !.
గడ్డం పెంచిన నీవు గొప్పా!
నామం పెట్టిన నేను గొప్పా! అంటూ
కాలు దువ్వుతున్న రంకెలను
ఒంటరిని చేసే
చితిమంటవై పుడుతున్నావని చెప్పవే!

-సత్యవతి

## అడుసు త్రొక్క నేల

యుద్ధము ఈ నాటిది కాదు
తండ్రి ఒక్కడే ఐనా
ఇద్దరు తల్లుల మధ్య
గల ఈర్ష్య ద్వేషాలే
దేవాసురుల యుద్ధానికి నాందీ...
పురాణ యుగములో నాడు పడ్డ
ఆ బీజపు రేణువులు
ఇంతై వటుడింతై అన్న చందాన
యుగాలుతో బాటు తాను పెరిగి
వట వృక్షపు వేళ్ళులాగా
నేటి సమాజములో నాటుకు పోయాయి...
అతివ - అధికారము - అవమానము
కృత యుగములో దేవా సురుల యుద్ధము,
అతివ- ఆకర్షణ - అవమానము
త్రేతా యుగములో రామ రావణ యుద్ధము,
అతివ- ఆస్తులు - అవమానము
ద్వాపరయుగములో కురుక్షేత్ర యుద్ధము...
అశ్వ మేధ యాగము చేసినట్టి
ఆ నాటి పురాణ పురుషుల కైనా
అశ్వము ఎక్కి వేల మైళ్ళు ప్రయాణించిన
మొన్నటి అలెగ్జాండర్ కైనా
ఆదిపత్యము పొందాలన్న ఆశ , ఆకాంక్ష
నాడు నేడు యుద్ధ కారణాలే...
సామంతుడను అంటే శరణము
స్వతంత్రుడను అంటే రణము
అస్త్రాలుతో నాడు పోరాడితే
అణ్వ స్త్రాలతో నేడు పోరాడుతున్నారు...
నల్లాల వద్ద నిత్యము
సగటు భారత మహిళల పాని పట్టు యుద్ధాలు,
ఆలికి అమ్మకు సర్దు బాటు చెప్పలేని
భర్తలకు ఇళ్ళలో అంతర్యుద్ధాలు,
అవినీతి నిర్మూలన పైన యుద్ధాలు,
ఊచకోత కోస్తూ దేశప్రజలను భయభ్రాంతులను
చేసే మతోన్మాద యుద్ధాలు,
ప్రపంచ అధిపత్యము కోరకు నీతులు చెప్పి గోతులు
తవ్వే ఆగరాజ్యాల యుద్ధాలు ...
విస్తరిలో ఉండే రెండు మెతుకుల కోసరము కుతుకలు
నొప్పి పెట్టునట్లు అరుస్తూ పోరాడే
కుక్కల కన్నా హీనము మన బ్రతుకులు,
కాసేపు అరచి వేటి దారిన అవి పోతాయి కానీ
ఈర్ష్య పెంచుకొని యుద్ధ ప్రణాళికలు రచించుకోవు
తరచి చూస్తే యుద్ధ కారణాలు అన్నీ
తెలుగు అక్షరాలు ( అ, ఆ) లతోనే
మొదలు అవుతున్నాయి
ఆర్థిక అస్థిరత, అవినీతి, ఆక్రమణ,
అధిపత్యము, అవమానము. అసమ్మతి,
అన్య మత దూషణ,
అధి కారము, ఆస్తులు, ఆడది,
అన్యాయము, అసమర్థత, అత్యాశ
మొదలయినవి,
అన్న వస్త్రములు చక్కగా తమ
పౌరులకు రోజు అందించిన దేశము
అణ్వస్త్రములు గురించి
యోచన చేయ వలసిన అవసరము
ఉండదు...
ఎద్దులు ఎద్దులు కుమ్ముకుంటే విరిగేవి
దూడల కాళ్ళే
దేశాలు దేశాలు పోరాడితే పోయేవి
లక్షల ప్రాణాలే,
అడుసు తొక్కి అశోకునిలా
నిర్వేదము చెందటము కన్నా
సామరస్యముగా శాంతి యుద్ధము
చేసిన గాంధీజీయే మిన్న.

-పూసపాటి

## నేనే...

ఆధునిక సమాజానికి అడుగులు వేసి
అభివృద్ధికి శంఖారావం పూరించింది నేనే.
సమసమాజ నిర్మాణానికి బాటలు వేసి
నవ నాగరికతకు నాందీ పలికింది నేనే.
అట్టడుగు వర్గాల అసమ సమాజంలో
అగ్రవర్ణాలకు హారతులు పట్టింది నేనే.
నగ్నంగా ఊరేగే మానవాళి మానానికి
రాట్నాన్ని తిప్పి వస్త్రధారణ చేసింది నేనే.
మనకు అన్నంపెట్టే రైతన్నల పనిముట్లకు
కొలిమిలో కాలి పనిముట్టయ్యింది నేనే.
సుందరమైన ఇంటి నిర్మాణాలకు
ఉపకరణాలను తయారుచేసేది నేనే.
చూడముచ్చటైన అలంకరణ వస్తువులను
అందంగా తయారుచేసి ఇచ్చేది నేనే.
దాహం వేస్తే కడుపార ఆకలి తీర్చేందుకు
అందమైన కుండలను ఆవిష్కరించింది నేనే.
అడవి జంతువులుగా మారిన ఆకారాలకు
చక్కని ఆకృతినిచ్చే క్షౌరవృత్తిని చేపట్టింది నేనే.
రోజంతా కష్టపడి అలిసిన దేహాలకు
కాసింతా సురాపానమందించి సేదతీర్చేది నేనే.
బడాబాబుల సుతిమెత్తని పాదాలకు
చల్లని పాదుకలను అందించింది నేనే.
సమాజంలో సామాజిక మార్పుకోసం
అనునిత్యం పోరాటం చేసింది నేనే.
అజ్ఞానపు అసమానతల అడ్డుగోడలపై
పాంచజన్యాన్ని పూరించింది నేనే.
సామాజిక వివక్షత అణచివేతలపై
తరతరాలుగా విజృంభించింది నేనే
నిత్యం అసమానతల అగ్నిగుండంలో
దగాపడి అగ్నికి ఆహుతవుతున్నది నేనే.
ఆత్మగౌరవ నినాదాన్ని తలకెత్తుకుని
బతుకు పోరాటం చేస్తున్నది నేనే.
నిత్యం చౌరస్తాలో హక్కులకోసమై నినదిస్తూ
మౌన పోరాటాన్ని చేస్తున్నది నేనే
మౌనంగా బతుకీడుస్తున్నది నేనే.



- డా. భీంపల్లి శ్రీకాంత్
9032844017

## లవ్ యూ అమ్మా....

నన్ను మోసింది నువ్వే
నా తొలి గుండె చప్పుడుకి చిరునామా నువ్వే
నన్ను కన్నది నువ్వే
నాకోసం కలలు కన్నది నువ్వే
నన్ను ఎత్తుకుంది నువ్వే
నీ గుండెలకు హత్తుకుంది నువ్వే
నీ రొమ్ము పాలు ఇచ్చింది నువ్వే
నీ ప్రేమలోని మురిపాలు పంచింది నువ్వే
నన్ను ఆడించింది నువ్వే
నన్ను ఆట పట్టించింది నువ్వే
నన్ను పెంచింది నువ్వే
నీ రక్తం పంచింది నువ్వే
నన్ను బడికి పంపింది నువ్వే
నాకు తెలిసిన తొలి గురువు నువ్వే
నన్ను చదివించింది నువ్వే
నాకు జీవితాన్ని నేర్పించింది నువ్వే
నాదైన గుణము నువ్వే
నాలోని ప్రాణం నీ నవ్వే
లవ్ యూ అమ్మా...



-బొమ్మకంటి మహేందర్
7032078727

## ఓ నాన్న !మళ్ళీ రా!

సరిగ్గా పుడమి నిద్ర లేచే యాల్లకి
ఆ ఇంట్లో అనుకోని ఉపద్రవం ఊడి పడింది
నిమ్మలంగ ఉన్న గుండెలు ఒక్కసారిగా
ఉద్వేగపు ఉప్పెనై గొల్లుమన్నయ్
ఇల్లంతా అల్పపీడన కేంద్రమై
కన్నీటి వర్షపు జల్లులు చిక్కగా కురిసినయ్
అమ్మ బొట్టును చెడిపేసి నాన్న
దేవ లోకంలో కలిసిపోయి దేవుడైండు.
అమ్మ ఏడ్చి ఏడ్చీ కండ్లు చెరువులైనయ్
కడుపులో కాసిన కాయలు నాన్న మీద పడి
బోరున విలపిస్తూ తట్టి లేపుతున్రు
ఎరుకున్నోళ్ళు , పాలోల్లు ధండలేసి
దండం పెడుతూ ఆయన జ్ఞాపకాలను మనసు
పొరల్లో పదిలంగా ఆరబోస్తున్రు.
కట్టుకున్న ఇల్లు ఇడిసి, తాలికట్టిన ఆలినిడిసి
రక్తం పంచిన పేగునిడిసి, బంధువర్గాలకు
స్నేహ బంధాలకు అలసిపోయి ఆగిపోయిన
గుండె తోటి మౌనంగా
ఆఖరి వీడ్కోలు పలికిండు
శాశ్వత సెలవు పత్రంపై సంతకం పెట్టిండు
ఇంతలోనే పాడెకట్రలు ,
పురికోసలు డప్పుసప్పుల్లు
పొలిమెరకు చేరుకున్నయ్
"ఆ నలుగురు" పట్టిన్రు ఆఖరి తానం పోసిన్రు
అప్పుడే తెచ్చిన కొత్త బట్టలు చుట్టిన్రు
బలగమంతా అంతిమ యాత్రలో సాగిన్రు
దింపుడుగల్లం దగ్గర తనదైన వరసలతోటి
నాన్నను ఆఖరి పిలుపును శెవులో
పిలుస్తూ కన్నీటి బొట్టును కార్చిన్రు
తాలికట్టిన ఆలి , తనువులో పుట్టిన వారు
కడవరకు రాకున్న కాడు పేర్చిన
కర్రలు మాత్రం కాసింత చోటిచ్చి
తనలో కలిపేసుకున్నయ్
కన్న కొడుకు తలగోరి పెట్టి అగ్గిని రాజేస్తే
కట్టెల్లో తను ఒక కట్టై కాలిపోతుంటే
కాడు సైతం భారంగా కన్నీళ్లు పెట్టింది.
ఇప్పుడు ఇల్లంతా సూర్యుడి లేని ఆకాశం
అయింది , వెన్నెల లేని అమావాస్య ఐంది
నాన్న ! నువ్వు లేని జీవితాన్ని
మేము ఊహించలేకపోతున్నాము
కండ్లు తెరిచిన కండ్లు మూసిన నీ జ్ఞాపకాలే
మా కండ్ల ముందు కదలాడుతున్నాయి
నీ నవ్వుల సవ్వడులు
నీ ఫోన్ కాల్ శబ్దాలు మా శెవులల్ల ఇంకా
మార్మోగుతూనే ఉన్నాయి
మాకు చదువుల సారాన్ని తాగించి
మా మనసులపై చెరిగిపోని ముద్రను వేశావు
మళ్ళీ జన్మంటూ ఉంటే మా నాన్నగానే రా !
నీ కోసం మేమందరం గుమ్మం దగ్గర
ఎప్పుడూ
ఎదురుచూస్తూనే ఉంటాం



- తాటిపాముల రమేశ్
7981566031

## అత్యాశ



నరసింహపురంలోని శరభయ్య చేపలు పట్టి జీవనం సాగించేవాడు. అతడు అత్యాశపరుడు.

ఒకసారి అతడు తమ గ్రామంలోని నదికి చేపలు పట్టడానికి గాలంతో బయలుదేరాడు. అతడు ఆ గాలాన్ని నదిలో వేశాడు. ఒక చిన్న చేప పడింది. ఆ తర్వాత ఆ గాలాన్ని మళ్లీ వేశాడు. మళ్లీ ఇంకొక చేప పడింది. ఈసారి ఆ గాలాన్ని మళ్లీ వేశాడు. అంతకన్నా పెద్ద చేప పడింది . ఇలా కొన్ని చేపలను పట్టాడు. వాటిని తన బుట్టలో వేసుకున్నాడు.

తర్వాత శరభయ్య ఇలా అనుకున్నాడు. " ఈ చేపలు నాకు ఈరోజుకు సరిపోతాయి. ఈరోజు నా అదృష్టం బాగుంది. అందువల్ల మరికొన్ని చేపలు పట్టి సంతలో అమ్ముకుంటాను. అప్పుడు నాకు చాలా డబ్బు వస్తుంది. ఆ డబ్బుతో నేను కొన్ని రోజులు హాయిగా గడపవచ్చు. నేను కొన్ని రోజుల వరకు మళ్లీ చేపలు పట్టకున్నా ఫరవాలేదు.

"అని అనుకొని మళ్ళీ గాలం వేశాడు. ఇంకా పెద్ద చేప పడింది . శరభయ్య ఎంతో సంతోషించాడు.

ఇంతలో ఆ నదికి వరద నీరు ఎక్కువైంది. శరభయ్యకు కొన్ని కొత్త చేపలు నీటి పైననే కనిపించాయి . వెంటనే శరభయ్య ఆ నీటిలోకి దిగి ఆ చేపలను పట్టుకున్నాడు. వాటినన్నింటిని తన బుట్టలో వేసి ఆ నది ఒడ్డు పైననే ఉంచాడు. మళ్ళీ నదిలోకి దిగాడు.

ఇంతలో వచ్చిన ఆకస్మిక వరదకు ఆ ఒడ్డున ఉంచిన చేపల బుట్ట నీటిలో కొట్టుకొని పోయింది. ఆ బుట్టను పట్టుకుందామని శరభయ్య ముందుకు వెళ్లాడు. కానీ అతనికి ఈతరాదు. ఆ బుట్ట అందలేదు. ఆ బుట్టతో పాటు అతడు కూడా కొట్టుకొని పోతూ "రక్షించండి !రక్షించండి !"అని గట్టిగా అరిచాడు . అక్కడ నది ఒడ్డున ఉన్న గజ ఈతగాళ్లు ఈ శరభయ్యను గమనించి అతని అరపులు విని వెంటనే వచ్చి అతనిని నీటి నుంచి బయటికి లాగి కాపాడారు.

అప్పుడు శరభయ్య ఇలా అనుకున్నాడు. "అయ్యో! నా అత్యాశనే నా కొంపముంచింది . నేను దొరికిన చేపలతో తృప్తి పడకుండా ఇంకా చేపలు కావాలనుకొని వాటిని అమ్ముకొని చాలా డబ్బులు సంపాదించాలని కలలు కన్నాను. నా కలలన్ని కల్లలయ్యాయి. ఇంకా నయం! ఈరోజు లేచిన వేళ మంచిది. ఆ గజ ఈతగాళ్ల పుణ్యమా అని నా ప్రాణాలు నాకు దక్కాయి."

అంటూ ఇంటికి ఖాళీ చేతులతో వెళ్ళాడు.

: అందుకే పిల్లలూ! అత్యాశ పనికిరాదు. దొరికిన దానితో తృప్తి పడాలి. నదికి వెళ్లినపుడు చాలా జాగ్రత్తగా ఉండాలి.



-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535





నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతివారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం -కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

## తడి లేని హృదయాలు

ఎప్పటికి వాడి పోనీ ప్లాస్టిక్ పువ్వులు
అయినవి బతుకులు
ప్రేమ వాసనలు
ఎండిన పలకరింపు లైనవి
అమ్మ అన్న మాట మొటు అయ్యింది
"మమ్" అన్న మాటే ఫ్యాషన్ అయ్యింది
వాట్సప్ గ్రూపులో హయ్ అనే మాటే
మొదటి పలకరింపైతుంది
అమ్మకైనా నాయన కైనా
అన్న దమ్ము ల్లాకైనా
ఆ మాత్రం పలకరింపైన
ఇంకా బతికి ఉంది
ఈ కలికాలంలో
పైసా తొడుగు తొడుక్కున్న మనిషికి
ఆప్యాయతలు ప్రేమలు అక్కర లేని వస్తువులు
పైసతో దొరికిన వాటితో తృప్తి పడి
జీవితాన్నిఎండమావుల ప్రేమలు
అల్లుకుంటున్నాయి
తడిలేని హృదయాలు మాట్లాడుతున్నాయి.

-గుండెల్లి ఇస్తారి
984 9983874

## సరిహద్దు

హద్దు హద్దు సరిహద్దు
ఎవ్వరు మీరద్దు సరిహద్దు
అవని లో అడుగడుగునా
కనిపించని సరిహద్దులు!
అంతులేని ఆ నింగికి ఈ నేలకు
దిగ్దిగంతాల సరిహద్దులు!
సమాజ జీవనాన్ని సరిదిద్దే
సమన్వయాల సరిహద్దులు
అనుక్షణం మనిషి జీవితం
హద్దుల సరిహద్దుల పొద్దు ల్లో
తెల్లారి పోతున్నది !
హద్దులు మీరుతున్న మాటలు
కత్తులు నూరే సమరం బాటలు!
పరిభ్రమించేవన్నీ సరిహద్దుల్లో
రువ్వడిగ సంచరిస్తున్నవి
మతి భ్రమించిన మనిషి
హద్దులెరుగక ఎగురుతున్నడు

తీర ప్రాంతాలు మునిగేలా
సముద్రంలో పోటు పోటుగా
తుఫానులు వాయుగుండాలు
ఎందుకో తెలుసా
కెరటాలు కెరటాలుగా అంతా
టన్నుల టన్నుల ఉప్పు ఉప్పే కదా !.
మనం ఉప్పు చెంచాలు చెంచాలుగా
తింటే
అంతే మరి !
రక్తం పోటు పోటుగా
అందరి పై విరుచుకు పడి పడి
తాను చచ్చుడే!!
బి పి మనిషి ??
బి పి సముద్రం ??

- కందాళై రాఘవాచార్య
8790593638

పంచభూతాలకు
నీ వంకర బుద్దులు అద్దకు!
హద్దులు సరిహద్దుల
అంతరార్థం నీకు అర్థమైతే
అంతులేని ఆనందం నీ సొత్తు!
హద్దు మీరితే సరిహద్దు
బుద్ధి చెప్పి నిన్ను సరిదిద్దు!

-పట్లోళ్ళ బక్కారెడ్డి
9705315250

## రమణ

రింగు రింగుల రాగి కురులు
యోగివోలే విశాల నుదురు
నుదిటి పై తిలకం చేతికి
సిల్వర్ మెటల్ గడి
చేతిలో రుమాలు మాటల్లో
మమకారపు తడి
స్వరం ఆయనకు వరం
ఆయన పాటకు పరవశమే సమస్తం
సాంప్రదాయం , సదాచారం
ఆయన నడవడి
తండ్రి కాలంచేయగా
డబ్బుకట్టల్ని చుట్టరికం కన్నేసి కాజేయగా
ఊరుమారిన, స్వర స్థాయి మారిన గొంతైంది
శాటిలైట్ లాగా భ్రమణాలు ఆయన వంతైంది
గుండెలో నిరాశ గూడుకట్టుకోగా
ఎడారి ఆశలఎండమావుల వెంట
సాగుతున్న ఒంటరి బాధల బడుగుజీవి
అరువిచ్చిన కాసులు
రెక్కలు కట్టుకొని వస్తాయని
నైరుతి కోసం రైతులవోలే ఆకాశంకేసి
ఆశగా ఎదురు చూస్తున్న ఆశాజీవి
ఆయనకు ఏ తోడు లేదు ఏ నీడా లేదు
ఏ ఆధారం లేదు
ఏ తీరం
దరిదాపుల్లో కానరాలేదు
చిల్లిగవ్వ చేతిలోలేక
విలవిలా కొట్టుకుంటుంది ఆయన
ఊపిరి
చింతామయ ముఖంలో
చిరునవ్వేమో ఆవిరి
గ్రంథాలయం, ఒక కిరాణం
కొట్టు, పెద్దవాగు
ఆప్యాయంగా అమ్మలాగా
అక్కునచేర్చుకున్నవి ఆయణ్ణి
ఆయన సొమ్ముకోసం
నిద్రాఆహారాలు మరచి
కృంగి, కృశించి
అస్థిపంజరమయ్యాడు కడకు
రేయీపగలూతిరిగి తిరిగీ
అలసి సొలసి
ఎండదెబ్బో, గుండెదెబ్బో
వేసవి వేడిరాతిరిలో వేదనతో వేసారి
తుదిశ్వాసలు ఒదిలాడు తుదకు పాపం
కట్టుకున్న బట్టలు,రేకు పెట్టెలు
కాళ్లరిగేలా తిరిగిన రోడ్డులు
కూర్చున్న కుర్చీ ,పడుకున్న మంచం
శ్మశానంలో ఇంత చితాభస్మం తప్ప
ఏమీ మిగిలిందిపుడు సాక్ష్యం
ఏదీ మానవత్వం ?
ఏది మనిషితత్వం?
మనిషిని మనిషిగా
నమ్మినందలకు సమాధానం
ఆయన మరణం
ఆయన ఆఖరు శ్వాసలు
అనంతవాయువుల్లోకలిసిపోవచ్చుగాక
ఆయన దాతృత్వం అనంతకాలం
అలా బ్రతికే వుంటుంది.

-రమేశ్ నల్లగొండ

## కుందేలు -తాబేలు

పందెంలో తాబేలుతొ
కుందేలే ఓడిపోయె కునుకులు తీస్తే
కందము చిన్నది యైనను
ఛందసు లో మేటియయ్యెచరితను చూస్తే
×××
విండొ వాలులన్ని విద్యార్థులేమాకు
బెంచి లుండె ముందు భేషు గాను
గిల్లి చెప్పుతాము పిల్లలు లేకున్న
కనుము వినుమురోరి కందుకూరి

-కందుకూరిశ్రీరాములు
సీనియర్ తెలుగు లెక్చరర్
తపస్య డిగ్రీ కాలేజ్ సికింద్రాబాద్

## 'పాట వల్ల జైలుకు వెళ్ళిన తొలి కవి గురిమెళ్ల'

పాటలవల్ల జైలుకు వెళ్లిన తొలి కవి గరిమెళ్ల సత్యనారాయణ అని ప్రముఖ జర్నలిస్ట్, హాస్య అవధాని శంకర నారాయణ అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో శుక్రవారం, ఎందరో మహానుభావులు శీర్షికల పరంపరలో భాగంగా గరిమెళ్ల సత్యనారాయణ యాదిలో పేరిట సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న శంకర నారాయణ మాట్లాడుతూ, నాటి పాలకులకు గరిమెళ్ల రచించిన దేశభక్తి గీతాల వల్ల తమపై ప్రజలు తిరుగుబాటు చేస్తారన్న భయంతో ఆయనకు జైలుశిక్ష వేశారన్నారు. 'మా కొద్దీ తెల్లదొర తనమూ' ఓ దేవా గీతంతో నాటి బ్రిటీష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన గరిమెళ్ల తొలి తెలుగు జాతీయ కవి అన్నారు. జానపద త్యాగయ్యగా పేరు గడించిన ఆయన చివరి రోజుల్లో జర్నలిస్ట్ వృత్తిని ఎంచుకుని నిజాయితీతో పనిచేస్తూ నిరుపేదగా మరణించడం బాధాకరమని శంకరనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, కథక్ కళాక్షేత్ర నిర్వాహకుడు కథక్ అంజుబాబు, టీడీపీ నేత వైషథం సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న శంకర నారాయణ

## మంచివారు కాదు ముంచువారు

పాలకూరలో నున్న
పాల రీతిగా,
నేతి బీరలోని నెయ్యి రీతిగా,
మంచివారనే వారిలో కూడా
వంచించే తత్వం ఉందంట,
వారిలో మాయాగుణం
అనే తెర అడ్డం ఉంటుందట!.
గోముఖ వ్యాఘ్రాల్లా,
మేకవన్నె పులుల్లా,
లోకంలో సంచరిస్తూ..
దొరికిందంతా తింటారట,
ఏమెరుగనట్లుంటారట!.
చేతలలో సాదుత్వంలో
మాటలలో మాధుర్యంలో
గోతులు తీస్తుంటారట
నూతిలో తోస్తుంటారట!
నమ్మకాన్ని అమ్ముకుని
మర్కటాల్ల మారిపోయి
తాము పట్టిన కుందేళ్లకు
మూడే కాళ్ళుఉంటాయని అంటారట!.
అనరాని మాటలు అన్నా
వినలేని మాటలు విన్నా
వినీ విననట్లు ఉంటారట
ఏమీ పట్టనట్లు ఉంటారట!.
అందిన కాడికి దోచుకున
దోచుకతిని దొంగ లెక్కలు చెబుతారు
తామెంతో సత్యపూసలమని
నమ్మించుటకై ప్రయత్నిస్తారు
ఇలాంటి వారితో స్నేహమైనా, బంధమైనా
విడనాడి బ్రతకడం అలవర్చుకోవాలి..
జాగ్రత్త –ఈ మాయదారి మనుషులతో!
తస్మాత్ జాగ్రత్త–ఈ మంచితనం అనే
ముసుగు ధరించిన మూర్ఖులతో!!
మంచితనపు ముసుగు ధరించిన ఈ
బుద్ది హీనుల గ్రహించి అప్రమత్తం కావాలి!
వారు మంచి వారు కాదు..
ముంచే వారని గ్రహించాలి!!



–ఎన్.. రాజేష్
9849335757

## ఆహారంపై ఆంక్షలెందుకు...?

పొట్ట కూటికై
పూటకూళ్ల ఇండ్లు నడిపే
వీధి వ్యాపారులపై
వ్యాకులత చెందే మాటలెందుకు.
మాటల మర్మం
మనసులను కలవరపడుతుందికదా
నామపలకాలపై పేర్లు
ఆకలి మంటలను ఆర్పవుకదా .
పాత్రల శుద్ధి
పాకశాల పరిశుభ్రతలో ఉందికదా
పాక నిపుణుల ప్రావీణ్యం
పదార్థ పవిత్రతలో ఉందికదా .
జీవుల జిహ్వా చాపల్యం
మంత్రుల మాటలకు
మారవుకదా
మాటల మంటలను
కుర్చీల కుమ్ములాటలు
మాన్పవుకదా
అఖండ భారతావనిలో
అన్నపానాదుల నియమం
వేరు వేరుకదా
ఆర్యా... అమాత్య వర్యా !
ఆహారంపై ఆంక్షలెందుకు...?



–డా.ఎడ్ల కల్లేశ్
9866765126

## పోరాట చిహ్నం నీవు

నీ ఒంట్లో పెరిగిన 100 గ్రాముల బరువు..
మా 140 కోట్లకు పైగా
గుండెల్లో మోయలేని బరువు...
పట్టు కుచ్చిళ్ళ వనితావని నేల మీద...
కుస్తీ పట్టు కురుక్షేత్ర పోరు లోన...
విచ్చుకున్న వినేశ్ పోగాట్..
నొచ్చుకున్న మా ఆశల ఆరాట్..
లైంగిక దాడుల నిరసనవు నీవు..
భారత నాడుల భరోసా నీవు..
ప్రాణాలు ఫణంగా పెట్టిన తెగువవు నీవు ..
ఫైనల్ చేరిన తొలి మగువవు నీవు..
సాటి రెజ్లర్ కొరకు విభాగం మారిన
పరివర్తనం నీవు..
పోటీ లేని ప్రత్యర్థికి ఓటమి నేర్పిన
గెలుపు పాఠం నీవు..
మరువలేని మల్ల యోధురాలువి..
మరుపురాని మరో ఝాన్సీ రాణివి..
'ఒలంపిక్' పతకం–
చరిత్రలో ఒక పేజీ నీకు..
ఓటమి చెందిన నీ కథ–
చెరగని చరిత్ర మాకు..

– స్వామి
9000218161

## ఊరు బడికి ఊత మిద్దాం

ఎన్నో పాదముద్రలు చిక్కగా తిరిగిన నేల
ఎన్నో బత్కు శిలలు శిల్పాలుగా మారిన నేల
ఎంతో మంది అక్కడి అక్షరాలను మింగి
తమ బత్కు చిత్రాన్ని సక్కగా గీసుకున్న నేల
ఎంతో మంది ఉన్నతికి ఊపిర్లూదిన
అమ్మ ఒడి లాంటి మన ఊరు బడి.
నేడు గ్లోబలైజేషన్ ఊడలు ఊర్లల్లకు దిగి
కార్పోరేట్ కంపు పేరెంట్స్ కు సోంపై
చీకటి తెరల్లోనే బస్సుల కూతల తోటి
కోడి పిల్లలను గద్ద తన్నుకు పోయినట్టు
ఊరు పిల్లల్ని అసాంతం ఊడ్సక పోయి
బుడతల బాల్యాన్ని బంధీ చేస్తూ
ఊరు బడిని ఎడారి చేస్తున్నారు.
ఇప్పుడు ఊరు బడి రెక్కలు తెగిపోయి
దిగులు పక్షి లా దిగాలుగా చూస్తుంది
పగిలిన గోడలు కూలుతున్న పెచ్చులు
నేలపైనే నేర్చుకుంటున్న చిన్నారులు
చినుకు పడితే బడంతా చిత్తడయి
పిల్లల కన్నీళ్లు మత్తడి పడుతున్నయ్.
ఎన్నో సీతాకోక చిలుకలు ఆ చెట్టుకింద
సేద తీరి బతుకు గాలిని పీల్చుకున్నయ్
ఎన్నో తారలు తమ విజయ పతాకాలను
ఎవరెస్ట్ పై ఏకంగా ఎగరేసారు
ఎన్నో మట్టిలో మాణిక్యాలు తళుక్కమని
మెరిసి బడి పేర్ను అవనికి అందించారు.
మరి ఇప్పుడు ఊరి బడి సమస్యల కొలనులో
చిక్కుకొని సహాయపు చేతులను చూస్తుంది
పచ్చ బడ్డ కుటుంబాలను బడుల్లోకి
ఆహ్వాన తోరణాలు కట్టినా అడ్డు పెట్టట్లేదు
ఏలికల ఏతులు కోటలు దాటుతున్నా
ప్రగతి మాత్రం గడప దాటట్లేదు
ఊరు బడికి ఊత మిద్దాం
దాని వృద్ధి కై కలిసి నడుద్దాం
బడి రక్షణ కై గొడుగు పడదాం



– తాటిపాముల రమేశ్
7981566031

## బొబ్బిలి నానీలు

నిశీధిలో
నిరీక్షిస్తోంది
కలువకన్నె
చందమామకోసం.

ప్రజాస్వామ్యానికి
మహా బలం
వివేకవంతులైన
ఓటర్లే సుమా!

పండుటాకు రాలింది
చిగురిస్తుంది మళ్ళీ
మనిషిపోతే
అంతే సంగతులు.

కాళ్ళమీద
నిలబడటం కాదు
మాట మీద
నిలడటం గొప్ప.

మనసును మురిపిస్తాయి
ప్రకృతి సోయగాలు
మనసంతా
ఆహ్లాదమే

ఉచితాలందుకునే వారికి
ఆనంద హేల!
ఉద్యోగులకు
వేతనగోల



– బొబ్బిలి జోసెఫ్
సెల్: 9989261991

## ఓ మనిషీ!

పూలుపూయని మొక్కను
పీకేయకురా!
కాయలుకాయని చెట్టును
కొట్టేయకురా!.

బిడ్డలుకనని భార్యను
బాధించకురా!
వాసనలేని విరులను
విసిరేయకురా!.

వర్షించని మేఘాలను
దూషించకురా!
పంటపండలేదని పొలాలను
బీడులుగా వదలకురా!.

నిత్యం మానవత్వం
చూపరా!
అనుదినం ఆర్తులను
ఆదుకోరా!.

రోజూ ప్రేమను
పంచరా!
ప్రతిదినం ప్రజాసేవను
చెయ్యరా!

సతతం సంఘసంక్షేమానికి
శ్రమించరా!
మనిషిగా మెలగరా
మూర్ఖత్వాన్ని వీడరా.



–గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్
సెల్: 7981616630

## మనిషి

మొలకెత్తే చిట్టిమొక్క ఏమనుకుంటుంది?తాను కల్పవృక్షం
కావాలనుకుంటుంది లోకం ఆకలి తీర్చాలనుకుంటుంది
వీచే చిరుగాలి ఏమనుకుంటుంది?
లోకాన్ని హాయిలో ముంచాలనుకుంటుంది
ఆనందాన్ని పంచాలనుకుంటుంది
కురిసే ప్రతిచినుకూ ఏమనుకుంటుంది
జీవులకష్టాల్ని కడగాలనుకుంటుంది
కన్నీటిని తుడవాలనుకుంటుంది
పూచే ప్రతిపువ్వు ఏమనుకుంటుంది? మనసును పరిమళంతో
నింపాలనుకుంటుంది
మనిషికి మమతను పంచాలనుకుంటుంది కుహూ...కుహూ...
మనే కోయిల ఏమనుకుంటుంది?
పాట పరిమళాన్ని అద్దాలనుకుంటుంది
పదుగురినీ పరవశింపజేయాలనుకుంటుంది ఉదయించే
సూర్యబింబం ఏమనుకుంటుంది?
వెలుగును పంచాలనుకుంటుంది
మనిషిని వెలిగించాలనుకుంటుంది
చిరునవ్వుల చంద్రబింబం ఏమనుకుంటుంది?
లోకంపెదవులపై వెన్నెలపువ్వులు పూయించాలనుకుంటుంది
చల్లదనాన్ని నింపాలనుకుంటుంది భూమితల్లి ఏమనుకుంటుంది?
తాను గాయపడుతూ అతిథులనాదరించాలనుకుంటుంది
సత్సంకల్పంతో సర్వం సహించాలనుకుంటుంది
సమస్త ప్రకృతీ ఏమనుకుంటుంది?
లోకాన్ని తనఒడిలో సేదదీర్చాలనుకుంటుంది
చేతనైన సాయం చేయాలనుకుంటుంది
నేటి మనిషి ఏమనుకుంటున్నాడు?
మానవత్వాన్ని మరుస్తున్నాడు స్వార్థాలపుట్టవుతున్నాడు
సమస్తాన్నీ కాలరాస్తున్నాడు!!



–డి.కె.చదువులబాబు
9440703716

## సంపద

కథ



–లక్ష్మణరావు పతంగే
సెల్:92900 79047

"ఏమయ్యా! ఏ ఊరు మంది? ఏమైంది గీఊరుగెందు కొచ్చినవు. గా తొవ్వల ఎట్ల పడ్డవు?" అని అడిగింది రత్న.

పండుకున్న జాగలకెల్లి లెవ్వబో యిన భూపతిని భుజం పట్టి లేపి కూసోబెట్టింది.

"ఎవ్వలు తల్లీ నువ్వు! లక్ష్మిదేవి లెక్కున్నవు? అసలు నేను యాడున్న, గీ ఇల్లెవల్లది? నేను ఈడ్కి ఎందు కొచ్చిన" అన్నడు భూపతి.

"నువ్వు పరేషాన్ గాకు మామా! గిది నీ యిల్లే అన్కో" అని గిలాసల పాలు తాగిచ్చింది రత్న.

"గిది మా యిల్లా? అయితే మా యాదగిరి గాడేడి?" అడ్గిండు.

'ముందుగాల గీ గోలీలు ఎస్కో ఇవరంగ అన్ని చెప్త' అన్నది. గోలీలిచ్చి సీసాలున్న అరకు పోసి తాపిచ్చింది.

గామె కండ్లల్ల సూస్కుంటనే మందు తాగిండు భూపతి. తాను ఏ ఊళ్ళె ఉన్నది ఎవరింట్ల ఉన్నది? మందు తాపిచ్చిన పిల్ల ఎవల్లో తెలుస్తలేదు. తెలివిల వొచ్చిన్సంది గాయ్నకు ఏమి సమజయిత లేదు.

ఎవ్వల్లో దిక్కులేని మన్సి. గీ ఊర్కి కొత్త మన్సిలెక్కున్నడు. మన్సి జూస్తె పెద్ద మన్సిలెక్కున్నడు. సన్న దోతి, తెల్ల కమీజు. చేత్కి ఉంగరం. చేత్ల ఛత్రి. మంచి చెప్పులున్నయి. నెత్తికి కలాబతు రుమాలు కట్టిండు. సోయిలేకుండ పడున్నడు. ఎవలింటికి బైలెల్లిండో తెల్వదు. పక్క ఊర్లె గత్తరు మొదలైందంట. గావూరు నించే వొస్తున్నట్లున్నది. కక్కుడు కాలకు అయ్యింది. తోవల్నె పడ్డడు. ఎన్క వోమన్సి వుండెనంట. వాడు యాడ తనకు గత్తరు సుట్టుకుంటదోనని గీయ్నను ఇడ్సిపెట్టి ఎళ్ళిపొయ్యిండు. గామంచినీళ్ళ బాయి కాడ ఊరుబ యట తోవ్వ పక్కనే సోయి లేకుంట పడున్నడు. ఊరి బైటికొచ్చిన జనం గాయన్ని అంతా సూస్తనే ఉన్రు. గాని ఎవ్వల్లకింత దయరాకపాయె! అయ్యో! ఎవల్లో ఏమోం సాటి మన్సి ఊళ్ళెకు తీస్కాపొయ్యి గింత ఇలాజ్ చెప్పిద్ద మన్న కయాలు ఎవల్లకూ రాకపాయె. అందరు సూసి పోబట్టిరి. గాని కనికరం సూపకపోయిరి. కాలం మారింది. జనాల గుండెలు బండలైనయి. అయినా లోకంల ఇంకా దర్మం నాయం ఉన్నది కాబట్టే లోకం నడుస్తున్నది. గసోంటి పున్యాత్ములు ఎదుటోళ్ళ కష్టాలు సూడలేరు. తమ శాతనైనంత సాయం జేస్తరు.

పొద్దు మీకింది. ఇండ్లకు గోదలొచ్చేయాలయింది. సూరీడు పడమటి దిక్కున్న గుట్టలెన్కకు పోబట్టిండు. నా మొగుడు పయిన మైబోతే నాకేం పని అని తమ్మిపువ్వు మూతి ముడ్సుకున్నది. కొట్టాలల్ల, సెట్లమీది గూళ్ళల్ల ఉన్న తమ పిల్లల కోసం గోదలు, పిట్టెలు అర్సుకుంట ఉర్కుతున్నయి. ఊళ్ళెకొచ్చె బాటలన్నీ గోదల దుమ్ముతోని నిండి పొయ్యినై. రైతులంతా యౌసం పనిముట్లు భుజాలకెత్తుకోని ఊరి మొకం బట్టిన్రు.

గాఊళ్ళె మంచినీళ్ళ బాయి ఊరి బయిటున్నది. అందరు గాడ్నెలై తాగే నీళ్ళు దెచ్చుకుంటరు. రత్న రాగిబిందె తీస్కొని ఎదురొస్తున్న గోదలను పక్కకు అదిలిస్తూ నడుం మీద బిందె పెట్కొని నీళ్ళ కోసం బైలెల్లింది ఊరి బైటికి. గా బాయికి కొంచెం దూరంల ఒక మన్సి పడున్నడు. ఒకల్లిద్దరు జనం పక్కన నిలబడి సూస్తున్రు. గాయ్న తెల్లబట్టలు ముర్కి ముర్కి అయినై. మన్సి జూస్తె యాభై ఏండ్లుంటయి. గట్టిగ మూల్గుతున్నడు. లెవ్వలేకుంటున్నడు. గాయ్నకు పక్కన తోడెవ్వల్లూ లేరు. రత్నకు గాయ్నను జూస్తె ఎందుకో అయ్యో! అన్పిచ్చింది. గాయ్నను జూస్తె తన తండ్రి యాదికొచ్చిండు. ఏవూరాయ్నో ఏమో ఎవల్లు సాయం జేస్తలేరు. గీజనానికి గింతకూడ దయలేదుగదా అనుకున్నది. గాయ్న బాదని సూడలేకపొయ్యింది. బిందె పక్కన పారేసింది. ఉరుక్కుంట దగ్గెర్కి పొయ్యింది. గావెం నోట్లెకెల్లి 'మామయ్య!' అనే మాటొచ్చింది. నల్గుర్ని జమచేసింది. తెల్సినోళ్ళను పిల్సి ఎడ్లబండి తెమ్మని పంపించింది. బండి రాగానే నల్గుర్ని పిల్సి ల్యాబట్టి బండ్లె కూసోబెట్టి తన యింటికి తీస్కొచ్చింది.

రత్న అమ్మ అయ్య నడీడోల్లు జనగామ రైలు ప్రమాదంల సచ్చిపొయ్యిన్రు. దిక్కులేని పచ్చి అయ్యింది రత్న. గప్పుడు గామె వయసు పదేండ్లుండె. మ్యానత్తకు ఎవరూ లేకపోవుటంతో వొచ్చి రత్నను కన్నబిడ్డె లెక్క సూడబట్టింది. ఉన్న కొంచె భూమి సేస్కుంట రత్నను సద్విచ్చింది. గామె కూడ పెద్ద మన్సే. రత్న ఊళ్ళెనె పదిదాక చద్వి మానేసింది. తనకున్న పొలం పని సూస్కుంట మ్యానత్తకు సాయంగా ఉండ బట్టింది. ఇంట్ల ఇద్దరే ఉంటరు. గప్పుడే రత్నకు పదారేండ్లొచ్చినయి. గామె పెండ్లి జేస్తే తన బాద్యత తీర్తది అనుకోబట్టింది రత్న మ్యానత్త రంగమ్మ. పది పాసయింది గాబట్టి వాళ్ళ ఊళ్ళెనె బళ్ళె పంతులమ్మ సర్కారీ నౌకరీ వొచ్చింది. పిల్లలకు సదువు సెప్పుకుంట జనానికి బుద్ధి సెప్పుకుంట సుకంగనే ఉన్నది. అయినగనీ గామె రంది అంతా రంగమ్మకే ఉన్నది.

భూపతి కోటగిరికి భూపతి లాంటోడు. గాఊళ్ళె అందర్కంటె పెద్ద బంగ్ల గాయ్నదె. ఇండ్లు భూములు మస్తు జాయదాదున్నది. గొడ్డు గోదా పాడీ పంటా ఇంతా అంతా కాదు. పేరుకు తగ్గట్లనే గాయ్న జమీందారు. జాగీర్లు పోయినా గాయ్న మాత్రం జాగీర్దారు లెక్కనే ఉంటడు.

**'నేనూ మన్సినే. మామా! సాటి మన్సి బాదపడ్తుంటే నేను సూడలేను. నిన్ను సూసి నా పానం కలక్కుమన్నది**

అయితే గా ఊరోల్లు మాత్రం గాయ్నను షాన మంచి మన్సి అని జెప్తరు. ఊరికేం కష్టమొచ్చిన గాయ్నే ముందుంటడు. గాఊరి జనమంతా గాయ్నకు ఎక్కడ కన్పిచ్చినా సేతులెత్తి దండం బెట్తరు.

సుట్టు పక్కల ఊర్లల్ల గాయ్న ఆసాములున్నరు. లావాదేవీలున్నయి. అప్పుడప్పుడు ఆసాముల ఇండ్లకు పొయ్యేటోడు. దానికోసమే రత్న వాళ్ళూరికొచ్చిండు. రత్న వాళ్ళూరు కోటగిరికి షాన దూరమే ఉన్నది. గందుకే గాయ్నను గాఊరోళ్ళెవ్వరూ గుర్తుపట్టలే. ఆయ్న యాడ్కి బొయినా ఎంట ఓ నౌకరును తోడు తీస్కాపొయ్యేటోడు. ఎప్పుడొచ్చె రామయ్య సుస్తయినందుకు కొత్తగా ఒకణ్ణి ఎంట తీస్కాపొయ్యిండు. రత్న వాళ్ళూరికి పొవ్వాలంటే నడ్మ ఇంకో ఊరుంటది. గాందాంకనే బస్సు పోతది. గాడ దిగి రెండు కోసులు నడుస్తె రత్న వాళ్ళూరు బుర్గుపల్లి వొస్తది.

భూపతి బస్సు దిగిండు. ఎన్క యాదగిరి బస్సు దిగి సామాన్లు ఎత్తుకొని నడవబట్టిండు. తొవల ఒక ఊరికాడ ఆగి సెట్టు కింద కూసొని సద్ది తిని నీళ్ళు తాగిన్రు. గాఊళ్ళె రెండ్రోజుల్నుంది గత్తర మొదలయింది. ఊళ్ళె నీళ్ళు కరాబైనయి. ఒకల్లిద్దరు సచ్చిన్రు. ఊరంత పరేశాన్లున్నరు.

గాఊల్లకెల్లె భూపతి యాదగిరి నడ్సుకుంట ఊరు దాటిన్రు. భూపతికి కడుపుల దేవినట్లయ్యింది. బైటికి పొయ్యిండు. కొంచెం దూరం నడ్సినంక మళ్ళ గట్లనే అయ్యింది. మల్ల బైటికొచ్చింది. గింతల్నె కక్కుకున్నడు. రెండు మూడు సార్లు అయ్యింది. ఎట్లనో కాళ్ళీడ్సుకుంట బూర్గుపల్లి ఊరిబయటిదాక చేరుకున్నరు. ఇగ గాణ్ణె ఊరిబైటి మంచినీళ్ళ బాయికాడ కూలబడ్డడు. సోయి లేకుంట పడున్నడు. గాయ్నను సూసిన యాదగిరి గాకక్కుడు కాలకు తనక్యాడ సుట్టుకుంటదో అన్కొని పారిపొయ్యిండు.

గద్ద నోట్లకెల్లి జారిపడ్డ కోడి పిల్ల లెక్క గిలగిల కొట్టుకుంటున్నడు భూపతి. ఊరుగాని ఊళ్ళె దిక్కులేనోడైయిండు భూపతి. గాయాల్ల ఆయ్నకు తన ధన్ దౌలత్ ఏదీ పనికి రానిదైపొయ్యింది.

గప్పుడు మంచినీళ్ళకోసం ఉరిబైటికొచ్చిన రత్నమ్మ గాయ్నను సూసింది. తండ్రి లెక్క అగుపిచ్చిండు. ఎన్క ముందు ఆలోసించలే. బండి తెప్పించి తన ఇంటికి తీస్కొపొయ్యింది. ఇంట్ల పైసల్లేవు. పక్కనున్న కోమటి లచ్చమ్మ దగ్గర కమ్మలు గిర్వి బెట్టి పైసల్దెచ్చింది. ఊళ్ళె ఉన్న కాస్తీ దాక్టర్ను పిలిచింది. మందులిప్పిచ్చింది. భూపతికి మల్ల పానం పోసింది. భూపతికి మెల్లగ సోయొచ్చింది.

"ఊం" అన్కుంట మూల్గిండు. అటూ తిర్గి సూసింది రత్న.

'ఏంది మామా! మంచీ నీళ్ళు తాగుతవా?' అన్నది.

'ఊం' అన్కుంట తలూపిండు.

గామె గొంతు మాట కోయిల కూసినట్లనిపిచ్చింది భూపతికి. మెల్లంగ కండ్లు తెర్సి సూసిండు. తన ముందు కూసున్న లక్ష్మిదేవి లెక్క కన్పిచ్చింది రత్న.

"నా ఎంటొచ్చిన యాదగిరిగాడేడి బిడ్డా?' అనడ్గిండు. పెయిల నాతవాని ఉండబట్టి మాటలు మెల్లగొచ్చినయి. లేసి కూసుందమన్కొని లెవ్వబొయ్యిండు గాని వశం కాలె. ఎంటనే రత్న ఈపుల చెయ్యేసి లేపి గోడకు వొరిగిచ్చి కూసొబెట్టింది.

'నీ యెంట ఓ మన్సిని సూసిన్రంట జనం. నీవు సోయి దప్పి పడిపోయింది సూసి వాడు పారిపొయ్యిండంట' అని అందరంటున్నరు. గాపోయ్ని బేయిమాన్గాడు నీ నౌకరా ఏంది?' అన్నది రత్న.

భూపతి తన చేతి వేళ్ళు సూసిండు. కొన్ని ఉంగరాల్లేవు. తన బస్తా తీసి సూసిండు. దాంట్లున్న పైకం మాయమయ్యింది. గా బద్మాష్గాడు నమక్ హరామ్ గాడెల్లిండు. వాన్కి భూపతి మస్తుగ సాయం చేసిండుగాని కష్టకాలంల వాడు బెయిమానయ్యిండు. గీ జమానాల ఎవ్వన్ని నమ్మేట్టు లేదు. ఉంగరాలు పొయినై, రూపాలు పొయ్యినై. తాను లక్పతి అయియుండి గూడా గిప్పుడు భికారి అయ్యిండు. గాఊరికి రావడం కూడ మొదటిసారే. గందుకే గాఊరోళ్ళు ఎవ్వలు తనను గుర్తుపట్టలే. గీ బిడ్డనే ఆదుకోకుంటే తాను దిక్కులేని సావు సావాల్సొచ్చేది. తన హాలతు బేహాలతయ్యింది. గడ్సిపొయ్యిందంతా యాదికొచ్చేసర్కి కండ్లల్ల నీల్లు తిర్గినై. పాపం! గాయ్న మొకం సూసిన రత్నకు కూడ ఎందుకో బొట బొట నీళ్ళు కంట్ల నుండి కారినై. కొంగుతోని కండ్లు తుడ్సుకొని భూపతికి 'ఏడ్వకు మామా! అన్నిట్కి దేవుడున్నడు' అన్నది.

'గా దేవుడున్నడో లేదో నాకు తెల్వదు గాని నాకు మాత్రం నువ్వే దేవుడువి' అన్నడు.

'ఊర్కో మామా! మేమున్నంగదా! అదృష్టంల ఎట్ల రాసుంటే గట్లనే అయితది' అన్నది.

'గది కాదు బిడ్డ! నువ్వు దేవతలెక్క వచ్చి నన్నాదుకోకుంటే నేను గాసెట్టు కిందనే పానం ఇడ్సేటోన్ని. గా నౌకరు యాదగిరిగాడు సూడు గింతకాలం నా దగ్గెరుండి నా తిండి దిని నాకే ధోకాయిచ్చిండు. దునియాల ధర్మం లేకుండయ్యింది తల్లీ. ఇన్సానియత్ అనేది అస్సలు యాడకన్పిస్త లేదు బిడ్డా. ఎక్కణ్ణో ఒక్కొరు నీ అసోంటోళ్లు ఉండబట్టె గీలోకం ఇంకా నడుస్తున్నది. నీవుండబట్టే నాకు మల్ల పానంల పానమొచ్చిందిగదా!' అన్నడు కండ్లు తుడ్సుకుంట.

'గదేంది మామ సిన్న పిల్లల్లెక్క ఏడుస్తవెందుకు? గీసేపు తిను' మని సేపు కాయ కోసిచ్చింది.

గోడకొరిగి కూసొని ఒక్కొక్క తున్క తిన్కుంట రత్న దిక్కు సూసిండు. గామె మాత్రం గాయ్న దిక్కు సూస్తలేదు. తలకాయ వొంచి సేపు కాయ కోస్కుంట కూసున్నది.

'ఏం బిడ్డా నీకు పెండ్లి అయ్యిందారా!' అనడ్గిండు భూపతి.

'ఇంకా లేదు' అన్నది తలొంచుకునే. మ్యానత్త పాలు తీస్కొచ్చి ఇచ్చింది. రెండు మూడు రోజుల్లనే పానం నయమైంది భూపతికి. పెయిల బలమొచ్చింది. కంజోరి పొయ్యింది. కొంచెం లేసి నడ్వబట్టిండు. ఇంటి ముందున్న అర్గుమీద కూసోని ఆలోచన సెయ్యబట్టిండు.

గాయ్న కండ్లల్ల రత్నమ్మ రత్నం లెక్క కనపడింది. గాపిల్ల ఎంత బాగున్నది. గామె చాల్చలన్ అన్నీ బాగున్నయి. గామెకు తల్లిదండ్రులు లేరు. ఏదో ఒక సాయం చెయ్యాలె అని మన్సుల అన్కొన్నడు.

సూస్తుండగనే వారం గడ్సింది. మన్సి మొదటి లెక్క తందురుస్తయ్యిండు. ఇగ తనూరికి బైల్దేర్దామనుకున్నడు. రత్న సొంత బిడ్డె లెక్క అన్పిచ్చింది. గామెను ఇడ్సిపోనీకె పానం దరిస్తలేదు. వారం రోజులు తనకు సాకిరి సేసింది. కాని ఎన్నడు తన ఊరు పేరు అడగలేదు. 'మామా! మామా!' అనే పిల్సింది. 'పొయ్యొస్తబిడ్డ! నీకు ఆ దేవుడు సల్లగ సూస్తడు. నీ సద్వు నీకు సంస్కారం నేర్పింది. నీవు నీ పేరుకు తగ్గదానివి. నీ ఋణం తీర్సుకోలేను బిడ్డా!' అన్నడు.

'నేనూ మన్సినే. మామా! సాటి మన్సి బాదపడ్తుంటే నేను సూడలేను. నిన్ను సూసి నా పానం కలక్కుమన్నది. నిన్ను సూస్తె పొయిన జన్మల నువ్వు మా అయ్యవో! మామవో అయ్యువుంటవు అన్పిచ్చింది. గందుకే నీకు ఇంటికి తీస్కొచ్చిన' అన్నది నవ్వుకుంట.

'నా పేరు భూపతిరా! మాది కోటగిరి. నువ్వు మా ఊరు పేరు ఇనే వుంటవు. మాది పెద్ద ఊరేలే. నేను మా ఊర్కి పొయ్యినంక నీకు ఉత్తరం రాస్తా బిడ్డా! సల్లంగ ఉండు. పైలంగ ఉండు. అత్తను సక్కగ సూస్కో' అని చెప్పి బైలెల్లిండు భూపతి. రత్న చెక్కంబండి ఏర్పాటు చేసింది. సద్దిగట్టింది. బండోని కిరాయి ఇయ్యబోతే వొద్దన్నడు. ఊరికి పొయ్యినంక నేనిస్త అన్నడు.

వారం గడ్సింది.

'పోష్టు! పోష్టు!' అన్కుంట వాకిట్ల నిలబడి అరవబట్టిండు. టప్పా తీస్కొచ్చిన కాశిం సాబు.

'ఏంటయెవ్యా కాశిమూ! గట్లరుత్తున్నవ్! యాడ్కెల్లి వొచ్చింది ఉత్తరం' అన్నది రంగమ్మ అత్త.

'ఉందుండు. మా రత్నమ్మను

**రత్న అమ్మ అయ్య నడీడోల్లు జనగామ రైలుప్రమాదంల సచ్చిపొయ్యిన్రు. దిక్కులేని పచ్చి అయ్యింది రత్న**

పిలుస్తా' అన్కుంట ఇంటెన్క పెరట్ల బట్టలారేస్తున్న రత్నకు చెప్పింది, 'టప్పా కాశిం సాబు వొచ్చిండని' ఉరుక్కుంటొచ్చింది రత్న.

'నీకీ మనియార్డరు వొచ్చింది బిడ్డా, గీడా దస్కత్తు చెయ్యి' అన్నడు కాశిం సాబు.

తనకు మనియార్డరు యాడ్కెల్లి వొస్తది, ఎవరు సేస్తరు అని హైరాన పడింది. కాశిం సాబు ఇచ్చిన రూపాలు తీస్కొన్నది. దాన్తోనే ఉన్న ఉత్తరం కూడ తీస్కొని సదవబట్టింది.

'చిరంజీవి రత్నమ్మకు పదివేల దీవెనలు!'

బిడ్డా గీ పైసలు ముట్టంగనే పరేశాను గాకు. నీవు సేసిన సేవకు కీమత్తు కాదిది. నీకు ఎంతిచ్చినా రుణం తీరదు. నువ్వు బాకీ సేసి పైసల్ తెచ్చిన సంగతి నాకు తెల్సు. గీ పైసల్తోని నీ బాకీలన్నీ తీర్సెయ్యి. పైసల్ సరిపోకుంటే ఉత్తరం రాయి. ఇంకిన్ని పంపిస్త. నువ్వు మా ఊర్కిమా యింటికి తప్పక రావాలె. నీ రాక కోసం యెయ్యి కండ్లతోని ఎదురుసూస్తుంట. నువ్వు వచ్చేటట్లయితే బండి పంపిస్త. తప్పకుండ నువ్వు మా యింటికి రావాలె సుమా! మర్సిపొయ్యేవు. అత్తమ్మకు నమస్కారం చెప్పు. మర్సిపొయ్యేవు

**భూపతి కోటగిరికి భూపతి లాంటోడు. గాఊళ్ళె అందర్కంటె పెద్ద బంగ్ల గాయ్నదె. ఇండ్లు భూములు మస్తు జాయదాదున్నది**

ఎదురు సూస్తుంట మల్ల. రావాలె.

దీవెన్లు.
–నీ మావ భూపతి.
కోటగిరి

గా ఉత్తరం సద్విన రత్న గుండె పొంగిపొయ్యింది. ఎంత మంచి మన్సి. ఊరికి పోంగనే ఉత్తరం రాసిండు. తనను మర్వలేదు. తన సేవకు యాదిపెట్టుకున్నడు. నిజంగనే తనకు మామ లేకున్న మామలాంటి మన్సి దొర్కిండు.

ఫలానా రోజు వస్తున్న అని ఉత్తరం మాత్రం రాయాలె. చేసిన అప్పులు కట్టేసింది. రంగమ్మను తయారుకమ్మంది. కోటగిరి సూసొద్దమని చెప్పింది. రంగమ్మత్త కూడా సై అన్నది. వాళ్ళూరికి కోసు దూరం లున్నది. రైలు టేశన్. నడ్సుకుంట పొయి రైలెక్కిన్రు. కోటగిరి బైలెల్లిన్రు.

రైలు కోటగిరి టేషన్ల ఆగింది. 'కోటగిరి! కోటగిరి' అన్కుంట హమాలోల్లు అర్వబట్టిన్రు. పెట్టె పట్కొని ఇద్దరు దిగిన్రు. గేటుకాడ తికట్లు సూపెట్టి బైటికొచ్చిన్రు. గాఊరేమో వాళ్ళకు కొత్త. యాగల్లికి పొవ్వాల్నో తెల్వదు. టేషన్కెల్లి ఊరు కోసుదూరంల ఉంటది. జట్కా బండ్లుంటయి.

భూపతి మామ! కన్పిస్తడేమో! అని అటూ ఇటూ కలేసూసిన్రు ఇద్దరు. ఊరేమో దూరంగున్నది. గాడ్కి ఎట్ల బొవ్వాలె. నడ్సుకుంట బోయినా గాయ్న పత్త ఎవరు సెప్తరు. పెద్ద ఊరే, పల్లెటూరు కాదాయె. ఎట్లబ్బా అన్కుంట నిలబడ్డరు. ఎవల్లనైనా అడుగుదామని శానసేపు గాణ్ణె నిలబడ్డరు. రైలు దిగినోళ్ళు కొంతమంది నడ్సుకుంట పోతుంటే, మరికొందరేమో చక్కాలల్ల, టాంగాలల్ల బైలెల్లిన్రు.

శానసేపు నిలబడ్డ ఈళ్ళను సూసిన వీరయ్య తన టాంగాని దగ్గర్కి తీస్కొచ్చి, 'యాడ్కి పొవ్వాలె అమ్మా' అని అడిగిండు. 'కోటగిరికా సెప్పుండ్రి, నాకన్ని ఇండ్లు ఎర్కె. నలభై ఏండ్లసంది టాంగ దోల్తున్న, సెప్పుండ్రి' అన్నడు.

'సూడు తాతా మేం కోటగిరికి పోవాలె. గా ఊరేమో మాకు కొత్త. ఊళ్ళె భూపతి అనే ఆయ్న ఇంటికి పొయ్యేదున్నది. గాయ్న ఇల్లు తెల్సా!' అన్నది రత్న.

'గదేంది బిడ్డా! గీ ఊల్లె గాయ్న ఇల్లు తెల్వందెవ్వరికి? గాయ్న ఎవ్వలనుకున్నవ్. ఈ ఊరి దొర. గీ ఊర్కేకాదు గీ ఇలాఖా అంతట్కి గాయ్నే దొర. మన్సి శాన మంచోడు. ధర్మరాజసోంటోడు. గాయ్న పేరు తెల్వనోడు గీఊళ్ళె ఎవ్వరుండరు. కూసోండ్రి ఇడ్సిపెడ్త' అన్నడు.

'గాయ్న ఇంటికే పొవ్వాలె. కిరాయి ఎంతయితే అంత ఇస్తం' అన్నది.

గామె చేత్లున్న పెట్టె తీస్కొని టాంగాల పెట్టి 'కూసోండ్రి' అన్నడు ఈరయ్య.

తొవ్వెంట భూపతిని పొగడబట్టిండు. గీ ఇలాఖాల్నే గసువంటి ధర్మాత్ముడు లేడన్నడు. అందర్ని దేవున్లెక్క ఆదుకుంటడు. ఊరికి ఏమొచ్చినా గాయ్న ముందుంటడు అని తారీఫు చేసుకుంట తోలబట్టిండు. గంతల్నే భూపతి యిల్లు వొచ్చింది. ఇద్దరు టాంగాలకెల్లి దిగిన్రు. ఈరయ్య పెట్టె తీస్కొని దొర ఇంటి అరుగుమీద పెట్టి వొచ్చి, 'పొయ్యొస్త బిడ్డ' అన్నడు. రత్న కిరాయి యియ్యబోయింది. 'వొద్దు బిడ్డ మీరు మా ఊరికి కొత్త, పైసలొద్దు. దొర ఇస్తడు' అన్కుంట గుర్రాన్ని అదిలిచ్చి ఎల్లిపొయ్యిండు.

'భూపతి మామ పేరే చెప్పిండు గాని తాను ఊరి దొరనని సెప్పనే లేదు సూడు అత్తమ్మా' అన్నది రత్న.

'పెద్ద మన్సులు తమను గురించి చెప్పుకోరమ్మా' అన్నది రత్నమ్మ.

తను ధనవంతుణ్ణనీ, గంత ధన్ దౌలత్ ఉన్నదనీ, మాట వరుసక్కూడా చెప్పలేదు. ఎంత గొప్ప మన్సి. అయినా ఏం లాభం. గాయాల ఏయి అక్కరకొచ్చినై' అనుకున్నది రత్న. తాను చదివిన పద్యం యాదుకొచ్చింది.

"విత్తమార్జనచేసి విర్రవీగుటే గాని కూడబెట్టిన సొమ్ము తోడు రాదు" అదో జాగీర్దారు గడి. లోపల బంగ్లా ఉన్నది. నౌకర్లు చాకర్లు అటూ ఇటూ తిర్గుతున్నరు. పెట్టెపట్కొని దర్వాజా కాడ్కి వొచ్చి నిలబడ్డరు. లోపల్కి పోనిస్తరో లేదో అని అనుమానపడసాగిన్రు.

గింతల్నె ఏదో పన్మీద భూపతి బైటికొచ్చిండు. వీళ్ళను సూడంగనే దంగ్ అయ్యిండు. ఉర్కుతొచ్చి పెట్టె అందుకున్నడు. గంతల్నే రామయ్యొచ్చి గాపెట్టె తాను తీస్కున్నడు. ఇంట్లకు తోల్కపొయ్యిండు. ముందుగాల రామయ్య మంచి నీళ్ళిచ్చిండు. వంట మనిషి అనసూయ చాయ్ చేసుకొచ్చి ఇచ్చింది.

అదొక జాగీర్దార్ల బంగ్లా. పెద్ద గేటు. దాన్ని దాటితే కుల్ల జగా. ఎదురుంగా పెద్ద భవంతి. నౌకర్లు అటూ ఇటూ తిర్గుతున్రు. చాయి తాగినంక భూపతి రంగమ్మను, రత్నను ఎంటబెట్కొని ఇల్లంత సూపెట్టిండు. ఆటెన్కాల రత్నకు ఓ అర్ర సూపెట్టి గిండ్ల ఉండుండ్రి బిడ్డా అన్నడు. రత్న లోపల్కి పొయ్యింది. పెద్ద గది. పందిరి మంచం. పెద్ద పెద్ద అద్దాలు. గాలి రానీకె కిటికీలున్నయి. పెద్ద పెద్ద జంపఖానా లున్నయి. ఎదురుంగ ఓ అందమైన వైసుపిల్లగాని పోటువ ఉన్నది. 'గీపిలగాడు ఎవరై ఉంటడు. భూపతి

**తను ధనవంతుణ్ణనీ, గంత ధన్ దౌలత్ ఉన్నదనీ, మాట వరుసక్కూడా చెప్పలేదు. ఎంత గొప్ప మన్సి. అయినా ఏం లాభం**

మామ కొడుకే అయ్యుంటడు' అనుకున్నది.

రత్న తలకు బోసుకున్నది. ఎర్రసీరె కట్టింది. ఎంట్కెలు ఇరబోసి తువ్వాలతోని దులుపుకుంటున్నది. ఎర్ర కుంకుమ బొట్టు పెట్టుకున్నది. అర్రలకెల్లి బైటికి రాంగానే భూపతి సూసిండు. గాయ్నకు లచ్మిదేవి తనింట్ల ప్రత్యక్షమైనట్లగుపిచ్చింది. దగ్గర్కొచ్చి 'అన్నీ సవులతుగున్నాయా?' అన్నడు.

'గిదేంది మామా! గిన్ని మర్యాదలు సెయ్యాల్నా' అన్నది.

'అన్నం తయ్యారుగున్నదంట. తినుండ్రి. నారాయణ తాతకు చెప్పిన. దగ్గరుండి వొడ్డిస్తడు' అన్నడు భూపతి.

'గట్లనే మామా! నువ్వు కూడా వొస్తే కల్సి తిందం' అన్నది.

'నేను గిప్పుడే నాష్ట జేసిన. మీరు తినుండ్రి' అన్నడు.

రత్న రంగమ్మ పొయ్యింట్లికు పోయిన్రు. నారాయణ అనసూయలు పీటలేసి కూసోబెట్టి వొడ్డించిన్రు. గావొంటలు గామర్యాదలు సూసి దంగైపొయ్యింది రత్న. భోజనాలైనంక వాళ్ళ కమరాలకొచ్చి కూసున్నరు.

గింతల్నే భూపతి చేత్ల ఓ నగలపెట్టె, ఇంకో చేత్ల పట్టు చీరల సందూక పెట్టె పట్కొని వొచ్చిండు. నగల పెట్టె రత్న చేతికిస్తూ, 'గీసొమ్ములు మీ అత్తయి. నీ కోసమే తీసి ఉంచిన. గీబనారస్ చీరలన్నీ నీ కోసమే. నువ్వు ఉంచుకో.

ఇంకేమన్న కావాల్నొస్తే సెప్పు. గిప్పుడే తెప్పిస్త' అన్నడు భూపతి.

'గివన్నీ నాకెందుకు మామా! నేనేం అడగలేదుగదా!' అన్నది తలొంచుకొని.

'నువ్వు చెప్పాల్నా బిడ్డా! నా కోడల్కి ఏం కావాల్నో నాకు తెల్వదా? అయినా గీయింట్ల గీసొమ్ములన్నీ పెట్కోనీకె ఎవరున్నరు బిడ్డ. మీ అత్త కాలం సేసింది. ఆడ పిల్లలు ఎవ్వలూ లేరు. ఉన్నోడు ఒక్కడే. రఘు' అన్నడు. వాడు సద్వు కోసం పట్నంల ఉన్నడు అన్నడు.

'ఏంది మామా! నేను ఈ యింటి కోడల్నా! అన్నది ఆశ్చర్యపోతు.

'ఈయాల్నుంది నువ్వే మా యింటి కోడలవు. ఈ జాయిజాతు అంతా నీదే. ఈడున్న హర్ చీజ్ నీదే. నీకెవ్వరూ ఎదురుచెప్పరు. నా కొడ్కు రఘు నిన్ను పెండ్లి జేస్కోనీకే రాజీ అయ్యిండు. ఈరోజే వొస్తున్నడు. పొద్దుగాల్నె తారిచ్చిన. గది సూడు మావోని ఫోటువ అని ఓ తస్వీర్ సూపెట్టిండు.

ఫోటోని సూడంగనే రత్న కండ్లు నమ్మలేకపొయ్యినై. రాముని లెక్కనే అందగాడు. ఏం అనాల్నో తెల్వలేదు. ఎంటనే భూపతి కాళ్ళమీద పడి మొక్కింది.

'మామయ్య! మట్టిలోనున్న నన్ను మహల్లోనికి తెచ్చినావా?' అంటూ సంతోషంతో కండ్లల్ల నీళ్ళు నింపుకున్నది.

'గదేంది బిడ్డా! నా కొడుకు కోసం సంబంధం ఉన్నదని తెల్సి మీ ఊరికొచ్చిన. గది మీ యిల్లే అని నాకు తరువాత తెల్సింది.

'తోవల్నె నాకు రోగం పట్టుకున్నది. గదీ ఒకందుకు మంచికే అయ్యింది. ఎత్కబోయిన తీగె కాళ్ళకు తగిలినట్ల నువ్వు నాకు దేవత లెక్క వొచ్చి కాపాడినవు. నీ కంటే గొప్పోల్లు ఇన్సానియత్ ఉన్నోల్లు గీదునియాల ఎవ్వలుంటరు సెప్పు. నా కొడుకుకు తగ్గ పిల్లవు నువ్వే. నాకు నచ్చిన కోడలవు నువ్వే!' అన్నడు భూపతి.

ఇద్దరు మాట్లాడుతనే ఉన్నరు. హైద్రాబాద్ కెల్లిన రఘుపతి రానే వొచ్చిండు. రత్నను సూసి కండ్లు మూయలేదు. దేవతనా దేవకన్యనా అనుకున్నడు. తనకూ నచ్చింది, తన నాయ్నకూ నచ్చింది. ఇంకేం కావాలన్కొని ముర్సిపొయ్యిండు. భూపతి రంగాచారి పంతుల్ని పిలిపిచ్చి లగ్గం మూర్తం బెట్టిచ్చిండు. ఊరంతా సంబరం జరుగుతున్నది. పెద్ద పెద్ద పందిళ్ళేసిన్రు. బాజాభజంత్రీలు మోగుతున్నయి. రంగమ్మత్త పెద్ద దర్వాజా ముంగల నిలబడ్డది. గట్నుంచి టాంగా ఈరయ్య వొచ్చిండు. 'ఏందమ్మా హవేలి అంతా సంబరంగా ఉన్నది' అని అడ్గిండు.

'అయ్యో! నీకు తెల్వదా ఈరయ్యా! మా రత్నమ్మకు దొర కొడుకు భూపతికిచ్చి పెండ్లి సేస్తున్నరు. రేపే పొద్దుగాల పెండ్లి. జరూరు రావాలె సుమా!' అన్నది.

'మంచిది. దేవుడు ఇద్దర్ని సల్లగ సూడాలె' అనుకుంట పొయ్యిండు టాంగా ఈరయ్య.

తెల్లారింది బాజాలు మోగినై, మంత్రాలినిపించ్చినై. అక్షంతలు పడ్డయి. ఊరి జనమంతా కడుపు నిండా తిని దీవెనలిచ్చిపొయ్యిన్రు. రత్నా రఘులు చేతులు పట్టుకొని సుక్కను సూస్కుంట నవ్విన్రు. ●

